RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 280 ISSUE NO : 280 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం, మే,6, 2026 Wednesday, May, 6, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తత..

## 6 ఇరాన్ పడవలను ధ్వంసం చేసిన

# అమెరికా

- హార్మూజ్ జలసంధిని తెరిపించేందుకు అమెరికా 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'
- అమెరికా నౌకలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు
- తమ పడవలు ధ్వంసమవలేదని ప్రకటించిన ఇరాన్
- 15,000 మంది సైనికులతో భారీ ఆపరేషన్ చేపట్టిన అమెరికా

**వాషింగ్టన్:** హార్మూజ్ జలసంధిలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇరాన్‌కు చెందిన ఆరు చిన్న పడవలను ధ్వంసం చేశామని, ఆ దేశం ప్రయోగించిన క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లను అడ్డగించామని అమెరికా సైన్యంప్రకటించింది.




## ప్రభాస్ సినిమా షూటింగ్..

# ఘోర ప్రమాదం..

### - షూటింగ్ కు వెళ్తున్న యూనిట్ సభ్యుల కారుకు యాక్సిడెంట్

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్‌డ్రామా 'ఫౌజీ' సెట్స్‌లో విషాదం నెల కొంది. ఈ ఉదయం షూటింగ్ నిమిత్తం వెళ్తున్న యూని ట్ సభ్యుల కారు హైదరాబాద్ శివార్లలోని అబ్దుల్లాపూర్ మెట్ వద్ద ప్రమాదానికి గురైంది. కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్ట డంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడిక క్కడే మరణించగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులనువెంటనే చికిత్స కోసంసమీప ఆసుపత్రికి తరలించారు.



## విద్యుత్ ఒప్పందాలపై..

# సీబీఐ విచారణ

### బీఆర్ఎస్ సర్కార్‌ను టార్గెట్ చేసిన రేవంత్ ప్రభుత్వం

- ఛత్తీస్‌గఢ్ పీపీఏ, భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్లపై ప్రధానంగా దర్యాప్తు
- జస్టిస్ మదన్ బి లోకూర్ కమిషన్ నివేదిక ఆధారంగా కేబినెట్ ఆమోదం

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరో గట్టి షాక్ తగిలింది. ఆ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పం దాలు (పీపీఏ), విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. నిన్న సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని విచారణ కమిషన్ ఈ అంశంపై సమర్పించిన 114 పేజీల నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం, భద్రాద్రి (4x270 మెగావాట్లు), యాదాద్రి (5x800 మెగావాట్లు) థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అవినీతి, ప్రజాధనం దుర్వినియోగం జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదికపై అడ్వకేట్ జనరల్ నుంచి న్యాయసలహా తీసుకున్న తర్వాతే కేబినెట్ ఈ నిర్ణయానికి వచ్చింది.



## యూఏఈపై ఇరాన్ దాడులు

# ఖండించిన ప్రధాని మోదీ

### ఆమోదయోగ్యం కాదని ప్రకటన

**డిల్లీ:** యూఏఈలోని ఫ్యుజైరా ఆయిల్ హబ్‌పై ఇరాన్ దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఇరాన్ జరిపిన డ్రోన్ దాడుల్లోముగ్గురు భారతీయులు గాయపడ్డారు. ఈ ఘటన పై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా దాడుల్ని ఖండిస్తూ మంగళవారం ఒక ప్రకటనవిడుదల చేశారు. "యూఏఈలోని ఫ్యుజైరా ఆయిల్ హబ్‌పై ఇరాన్ జరిపిన దాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. పౌరుల్ని, సాధారణ నిర్మాణాల్ని లక్ష్యంగాచేసుకుని దాడులు జరపడం ఆమోదయోగ్యం కాదు. ఈ క్లిష్ట సమయంలో యూఏఈకి ఇండియా మద్దతుగా ఉంటుంది.



## బెంగాల్, అసోంలలో

# ఓట్ చోరీ

### జనాదేశాన్ను చోరీచేసిన బిజెపి

# మరోమారు రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,మే5 :** బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

## బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు

# రాజకీయాలు



### వరంగల్ రైతుమేళా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

**హనుమకొండ,తెలంగాణ దిశ :** బిఆర్ఎస్, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదన్నారు. మోడీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చేలోగా సిబిఐ విచారణకు ఆదేశించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21వేల కోట్లు చెల్లించామని చెప్పారు.



# నేడు ఢిల్లీకి రేవంత్ రెడ్డి

- మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు అనుమతులపై దృష్టి సారించనున్న సీఎం
- కాంగ్రెస్ పెద్దలను కలవనున్న రేవంత్
- కేరళలో యూడీఎఫ్ విజయం నేపథ్యంలో రేవంత్ పర్యటనకు మరింత ప్రాధాన్యత

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్టు సమాచారం. ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై విజ్ఞప్తులు చేయనున్నారు.

# గవర్నర్‌కు టీవీకే విజయ్ లేఖ



**చెన్నై:** తమిళనాడు గవర్నర్‌కు టీవీకే చీఫ్ విజయ్ లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. రెండు వారాల్లో మెజారిటీ నిరూపిస్తామని.. అవకా శం ఇవ్వాలంటూ విజయ్ కోరారు. లోక్‌భవన్‌కు ఈ-మెయిల్ ద్వారా ఆయన లేఖ పంపినట్లు సమాచారం. విజయ్ తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మరో 10 మంది ఎమ్మె ల్యేల మద్దతు అవసరం. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 సీట్లు ఉండగా.. మ్యాజిక్ ఫిగర్ (మెజారిటీ మార్క్) 118. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం 108 స్థానాల ను గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థు లు, ఒకట్రెండు సీట్లు గెలుచుకున్న చిన్న పార్టీలపై విజయ్ దృష్టి సారిం చారు. సంఖ్యా బలం పరంగా చూ స్తే.. కేవలం 10 మంది ఎమ్మెల్యేలు అవసరమైనందున.. ఇతర పార్టీల నుంచి చీలిక తీసుకురావడం కంటే స్వతంత్రుల మద్దతు కూడగట్టడం సులభంగా టీవీకే భావిస్తోంది.



# అన్నిరకాల దౌర్జన్యాలు చేశారు

### తనపై కూడా దాడికి తెగబడ్డారు
### ఫేస్‌బుక్ పేజీలో మమత ఫోన్‌కాల్ ఆడియో

**కోల్‌కతా,మే5 :** కౌంటింగ్ సెంటర్‌లో తనపై దాడి జరిగినట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీతో ఫోన్‌కాల్‌లో ఆమె ఈ ఆరోపణలు చేశారు. మమతా బెనర్జీ మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను ఎంపీ కళ్యాణ్ బెనర్జీ తన ఫేస్‌బుక్ పేజీలో పోస్టు చేశారు. కౌంటింగ్ వద్ద ప్రవర్తన సరిగా లేదని, తుది రౌండ్ల సమయంలో అక్రమాలు జరిగినట్లు మమతా బెనర్జీ తన ఫోన్ కాల్‌లో పేర్కొన్నారు. భబానీపూర్‌లో తుది రౌండ్ల కౌంటింగ్ మా ప్రాంతానివని, ఆ సమయంలో కొందరు గుండాలు కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించారని, నన్ను కొట్టారని, సీఆర్పీఎఫ్ సహాయంతో మా ఏజెంట్లను తోసేశారని మమతా బెనర్జీ ఆ ఫోన్‌కాల్‌లో ఆరోపించారు. కీలక సమయంలో కౌంటింగ్ హాల్‌లోకి తనను ఎంట్రీ కానివ్వ లేదన్నారు. భబానీపూర్‌లో కౌంటింగ్ పక్రియ థ్రిల్లింగ్‌గా సాగింది. 20 రౌండ్ల కౌంటింగ్‌లో కొన్ని సమయాల్లో అటూ ఇటూవెళ్లింది. ఆరంభంలోమమతా బెనర్జీ రెండు వేల ఓట్ల మెజారిటీతో ఉన్నారు. ఏడో రౌండ్ సమయానికి ఆమె 17 వేల ఓట్లు ఆధిక్యంలోకి వెళ్లారు. ఇక ఆసమయంలో టీఎంసీ మద్దతు దారులు దాదాపు సంబరాలు చేసుకున్నారు. ఇక తర్వాత ఫలితాల్లో మార్పు మొదలైంది. 14వ రౌండ్ ముగిసే వరకు మమతా బెనర్జీ ఆధిక్యంనాలుగు వేలకు పడిపోయింది.కొన్ని రౌండ్లతేడాలోనే నాటకీ యంగా బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఆధిక్యంలోకి వెళ్లారు.

# సందడిగా స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ కోచింగ్ క్యాంప్స్

## - జూన్ 7 వరకు 33 జిల్లాలలో స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ క్యాంపులు










**హైదరాబాద్, మే 05, (తెలంగాణ దిశ)** :స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలోజంట నగరాల్లోని అన్ని స్టేడియాలతో పాటు 33 జిల్లాలలో ఏప్రిల్ 24న ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగుతాయి. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులకు యువ క్రీడాకారుల నుండి అనూహ్య స్పందన లభిస్తుందని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ తెలిపింది. జంట నగరాల్లోని స్టేడియంలో ఇప్పటికే 3 వేలకు మంది క్రీడాకారులకు పైగా ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకొని ఈ క్రీడల్లో పాల్గొంటున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది. నగరంలోని గచ్చిబౌలి స్టేడియం, ఎల్ బి స్టేడియం, జింఖానా గ్రౌండ్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, యూసుఫ్ గూడ కేవీబిఆర్ ఇండోర్ స్టేడియం, ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వేలోడ్రం, హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్లలో ఈ శిక్షణా శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల నుండి వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహించి ఎంతో మంది క్రీడా ఆణిముత్యాలను గుర్తించి ప్రోత్సహించినట్లు స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది. సానియా మీర్జా, సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్ వంటి ఎందరో క్రీడాకారులు అజారుద్దీన్, పుల్లెల గోపీచంద్ లాంటి క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ప్రాథమిక పాఠాలు నేర్పింది. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్ ఫోన్లు, ఆన్ లైన్ గేమ్స్ కంప్యూటర్లకు పరిమితం కాకుండా వారికి ఆటల ద్వారా ఆరోగ్యం అందించడమే కాకుండా మనో వికాసానికి ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులు దోహదం చేస్తాయని క్రీడా శాఖ అధికారులు తెలిపారు. అనేక ప్రైవేట్ కోచింగ్ సెంటర్లతో పోలిస్తే స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మైదానాల్లో అనుభవం కలిగిన కోచ్ లు మధ్యతరగతి సామాన్యులకు కూడా అందుబాటులో ఉండే ఫీజులతో మంచి ప్రమాణాలు కలిగిన క్రీడా శిక్షణ అందిస్తున్నామని స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా ఈ వేసవి శిబిరాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా యోగా, జుంబా డాన్స్ లలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపింది. గత వేసవి శిబిరాల్లో ప్రవేశ పెట్టిన యోగా జుంబాలకు విపరీతమైన ఆదరణ లభించిందని ఈ సంవత్సరం కూడా అదేవిధంగా కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. గతంలో కంటే ఈ సంవత్సరం ఎక్కువ క్రీడాంశాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. అంతే కాకుండా కాకుండా గతంలో కేవలం జిల్లా కేంద్రాలకు పరిమితమైన ఈ వేసవి శిక్షణ శిబిరాలను ఈసారి పలు పట్టణ కేంద్రాల్లో కూడా నిర్వహించబోతున్నామని స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది. ఈ వేసవి శిబిరాల్లో వివిధ క్రీడాంశాలలో అసిస్టెంట్ కోచ్ లుగా సేవలందించే వారికి గౌరవ వేతనం గత సంవత్సరం నుండి పెంచి అనుభవజ్ఞులైన క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుంది. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొనదలచిన క్రీడాకారులు విద్యార్థులను ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకోవాలని వారి సమాచారాన్ని భవిష్యత్తులో క్రీడా అవసరాలకు వినియోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం ఇచ్చే విధంగా ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ముమ్మరంగా ఏర్పాటు చేసినట్లు యువ క్రీడాకారులు, విద్యార్థులు ఈ శిబిరాల్లో అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేసినట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. ఈ శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారుల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నామని ఆయన తెలిపారు. అసిస్టెంట్ కోచ్ లుగా సేవలందించే వారి వివరాలను కూడా ఆన్ లైన్ లో పొందుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న క్రీడా ప్రోత్సాహక విధానాల వల్ల క్రీడల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని, అందుకే ఈ శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తుందని ఆయన వివరించారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభ ను విజయవంతం చేయాలి

## - ఎస్ సి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసి నాగరాజు



**కుత్బుల్లాపూర్, మే 05, (తెలంగాణ దిశ)** :సైబరాబాద్ నిజాంపేట్ సర్కిల్ 58 నిజాంపేట్ తెలంగాణ రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసి నాగరాజ్ వారి కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసి నాగరాజ్ స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో మే 10 వ తారీఖున నిర్వహిస్తున్న భావితరాల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. అనేక సర్వే సంస్థలు ప్రపంచ నాయకుడిగా నరేంద్ర మోడీ ని గుర్తించాయని 29 దేశాల ప్రథమ పౌర పురస్కారాలు అందుకున్న నాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఒకే ఒక్క ప్రపంచనేత ప్రధాని నరేంద్ర మోడీ అని తెలిపారు. దేశ ప్రజలందరినీ తన కుటుంబం గా భావించి వారి సంక్షేమం కోసం నిరంతరం రోజుకు 17, 18 గంటలు శ్రమిస్తున్నారని గుర్తు చేశారు.దేశం కోసం పనిచేసే మోడీ కి మనమందరం అండగా ఉండాలని తెలిపారు. మే 10 వ తారీఖున తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా రూ. 7823 కోట్ల అభివృద్ధి పనుల కోసం మూడవ సారి ప్రధానిగా గెలిచిన తర్వాత మొదటిసారిగా తెలంగాణ గడ్డమీదికి వస్తున్న ప్రధానమంత్రి కి మనం ఘన స్వాగతం తెలియజేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. మహిళలకు చట్టసభలలో 33 శాతం ప్రకటించే కాంగ్రెస్ నాయకులు దానిని వ్యతిరేకించి చట్ట సభలకు మహిళలను రానీయకుండా చేసిందని, కాంగ్రెస్ బుద్ధి రావాలంటే మహిళలందరూ సభలో పాల్గొనాలని కోరారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను, గ్యారెంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ను ప్రశ్నించడానికి ప్రజలందరూ తరలిరావాలని కోరారు. నరేంద్ర మోడీ సభకు యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, కార్మికులు, సంఘీభావం తెలపాలని కోరారు. ఇరాన్ అమెరికా యుద్ధ సమయంలో అన్ని దేశాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మన భారతదేశం మాత్రం ఎటువంటి ఇబ్బందికి గురి కాలేదు అన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట బిజెపి అధ్యక్షుడు బిక్షపతి యాదవ్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, జిల్లా బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, నిజాంపేట్ బిజెపి ఉపాధ్యక్షులు కౌశిక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కమిటీ నిర్ణయాలను నిలిపివేయండి

## - హైకోర్టులో టీడబ్ల్యూజెఎఫ్ పిటిషన్

**హైదరాబాద్, మే 05, (తెలంగాణ దిశ)** :మీడియా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ లు చేసిన, చేయబోయే నిర్ణయాలను నిలిపివేయాలంటూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య తెలంగాణ హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ(ఎన్ఎంఏసీ), జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ(డీఎంఏసీ)లలో తమ టీడబ్ల్యూజెఎఫ్ సభ్యులకు అవకాశం



కల్పించకుండా నిబంధనలకు విరుద్ధంగా కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి అక్రిడిటేషన్ కార్డులపై నిర్ణయాలు చేస్తున్నారని ఆయన పిటిషన్ లో పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 252 ప్రకారం కమిటీలో నాలుగు జర్నలిస్టు యూనియన్లు, సంఘాల ప్రతినిధులు ఉండాలని, కానీ కేవలం మూడు యూనియన్లు, సంఘాల ప్రతినిధులను మాత్రమే చేర్చి తమ యూనియన్ ప్రతినిధులను తీసుకోకుండా పెండింగ్ పెట్టి ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఈ పిటిషన్ లో ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్, మీడియా అకాడమీ ఛైర్మెన్ లతో పాటు 33 జిల్లాల ప్రజా సంబంధాల అధికారులు(డీపీఆర్ ఓ)లను ప్రతి వాదులుగా చేర్చారు.

### అక్రిడిటేషన్ కమిటీల జీఓ 229 రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీడియా అక్రిడిటేషన్ల జీవో 252కు అనుబంధంగా రాష్ట్ర, జిల్లా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో ఆర్టీ 229 ను నిబంధనలకు విరుద్ధంగా అమలు చేసినందున ఈ జీవోను రద్దు చేయాలంటూ హైకోర్టు లో మంగళవారం పిటిషన్ దాఖలైంది. టీడబ్ల్యూజేఎఫ్ సభ్యుడు, ఏవీఎన్ టీవీ కరస్పాండెంట్ నంబి పర్వతాలు అనే జర్నలిస్టు జీవో 229 అమలు తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో కేసు ఫైల్ చేశారు. అక్రెడిటేషన్ కమిటీలలో నాలుగు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఉండాలని జీవో 252లో పేర్కొనగా, జీవో ఆర్టీ 229 ద్వారా కేవలం మూడు సంఘాల ప్రతినిధులను మాత్రమే తీసుకున్నారని, టిడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ప్రతినిధులను కమిటీల్లోకి తీసుకోకుండా కమిటీ నిర్ణయాలు చేయడం జీఓ 252 కు విరుద్ధమని, అందుకని ఈ జీవో ఆర్టీ 229ను సస్పెండ్ చేయాలని హైకోర్టును కోరారు. ఈ పిటిషన్ లో కూడా ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ను, మీడియా అకాడమీ ఛైర్మన్,అన్ని జిల్లాల డీపీఆర్వోలను ప్రతివాదులుగా చేర్చారు.

# త్రాగునీరు, సివరేజ్ పనులకు రూ. 50 కోట్ల నిధులు కేటాయించాలి

## - జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, మే 05, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో త్రాగునీరు, సివరేజ్ పనులకు రూ. 50 కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సివిరేజ్ బోర్డ్ ఎండి అశోక్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని గాజులరామారం, కొంపల్లి, జీడిమెట్ల, దుండిగల్, నిజాంపేట్, చింతల్ సర్కిల్ ఉన్న ప్రజానీకం ఎదుర్కొంటున్న త్రాగునీరు, సివరేజ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ పనులను చేపట్టేందుకు అవసరమైన సుమారు రూ. 50 కోట్ల నిధులకు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అశోక్ రెడ్డికి వారి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ కుత్బుల్లాపూర్ జోన్ లోని ఆరు సర్కిల్లో జలమండలి ఆధ్వర్యంలో అసంపూర్తిగా ఉన్న పనులను చేయటంతో పాటు కొన్ని పనులు టెండర్ ప్రక్రియలో నిలిచిపోయాయని వాటిని వెనువెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రీ టెండర్ చేయించి పనులను పూర్తి చేయాలని కోరారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎలాంటి మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని, అదే విధంగా లో ప్రెజర్ నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అశోక్ రెడ్డిని కోరారు. అనంతరం జలమండలి ఎండి అశోక్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే సమగ్ర వివరాలతో ఇచ్చిన వినతి పత్రాన్ని పూర్తిగా పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయటంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుచ్చిరెడ్డి, గుమస్తా మధుసూదన్, అంజి ముదిరాజ్, అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త తొలగించాలి



**కుత్బుల్లాపూర్, మే 05, (తెలంగాణ దిశ)** :నిజాంపేట సర్కిల్ డబల్ బెడ్ రూమ్ వద్ద ఉన్న డంపింగ్ యార్డులో చెత్త పేరుకుని పోయి స్థానిక కాలనీ వాసులకు తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుందని, దానిని తక్షణమే జవహర్ నగర్ కు తరలించాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన డంపింగ్ యార్డు ను సందర్శించారు. ప్రతి మూడు నెలలకు సుమారు రెండు కోట్ల వరకు మున్సిపల్ డబ్బు ఖర్చు చేస్తూ జవహర్ నగర్ కు చెత్త తరలిస్తున్నప్పటికీ అది శాశ్వత పరిష్కారానికి నోచుకోకపోవడం దారుణమని అన్నారు. అదే ఖర్చుతో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ను ప్రభుత్వమే నెలకొల్పి ఖర్చును ఆదా చేయవచ్చని అయినా కూడా అధికారులు ఆవైపు ఆలోచన చేయడం లేదంటూ ఆయన విమర్శించారు. నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ సరైన పర్యవేక్షణ, స్పందన చూపడం లేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుత చెత్త తరలింపు కాంట్రాక్టర్ గడువు ముగియడం, రామ్ కి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ లిమిటెడ్ తో సమయానికి ఒప్పందం కుదరకపోవడం కారణంగా డంపింగ్ యార్డులో చెత్త నిండిపోయి రోడ్లపై వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన వివరించారు. ప్రస్తుత సర్కిల్ అధికారులు కొందరి ఆర్థిక ప్రయోజనాలను కాపాడడానికి చిత్త సమస్యకు పరిష్కారం చూపడం లేదని అన్నారు. ప్రతిరోజు సుమారు 180 టన్నుల చెత్తను క్రమం తప్పకుండా జవహర్ నగర్ కు తరలించాల్సి ఉండగా కొద్ది రోజుల నుండి ఆ ఏర్పాట్లు చేయడం లేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త ప్రాసెసింగ్ విషయంలో అధికారులు శాశ్వత ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకోవాలని, ప్రభుత్వ డబ్బును ఆదా చేయాలని ఆయన కోరారు. ఆకుల సతీష్ వెంట మోహన్, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, బాల బ్రహ్మాచారి, నందు, నీలకంఠం, దుర్గాప్రసాద్, సైదులు, సంజు, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగవ శ్రీహరి చెస్ ట్రోఫీ విజేతగా ఆరుష్ రెడ్డి




కీసర, మే 05, (తెలంగాణ దిశ) :శ్రీహరి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ శ్రీహరి చెస్ ట్రోఫీ విజయవంతంగా ముగిసింది. ఈ పోటీలో వివిధ వయస్సు గల ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఓపెన్ కేటగిరీలో ఆరుష్ రెడ్డి అద్భుతమైన ప్రదర్శనతో విజేతగా నిలిచారు. వేదిక్ రెడ్డి రెండవ స్థానాన్ని, ఎండి. రఫీ మూడవ స్థానాన్ని సాధించారు. టాప్ 10లో వినయ్ కుమార్ (4వ స్థానం), అనుధ్య రెడ్డి (5వ స్థానం), ఎన్. శ్రీకర్ (6వ స్థానం), మనోజ్ కుమార్ (7వ స్థానం), జ్యోతి (8వ స్థానం), వేదాంశ్ గౌడ్ (9వ స్థానం), ప్రభాకర్ రెడ్డి (10వ స్థానం)లో నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో చిన్నారులను ప్రోత్సహించే ఉద్దేశంతో వయస్సు ఆధారిత విభాగాలు కూడా నిర్వహించారు. ఇందులో భాగంగా అండర్ 9లో నిక్షిత్ రెడ్డి (1వ స్థానం), విరాజ్ (2వ స్థానం),అండర్ 11లో కాజా అర్మాన్ (1వ స్థానం), శ్రీ నందన్ (2వ స్థానం), అండర్-13లో ఓంకార్ (1వ స్థానం), కానిష్క్ రెడ్డి (2వ స్థానం), అండర్ 15లో పూజిత్ (1వ స్థానం), అభి వర్షిత్ (2వ స్థానం) సాధించారు. ఈ పోటీలు యువ చెస్ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించడానికి మంచి వేదికగా నిలిచాయి. ఈ పోటీలు క్రీడాస్ఫూర్తిని పెంపొందించాయి. అదే విధంగా అకాడమీ వారు మే 5 నుండి జూన్ 15 వరకు నిర్వహించనున్న సమ్మర్ చెస్ క్యాంప్ గురించి కూడా ప్రకటించారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కల్పించబడుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌ను దరా శ్రీనివాస్ నిర్వహించారు. మరిన్ని వివరాలకు 89197 58232 ఫోన్ నంబర్ లో సంప్రదించవచ్చు.

# కీసర మండలంలో టాప్ ర్యాంక్ సాధించిన యామిని గర్వకారణం

## - ఉన్నత చదువులకు సహాయం చేస్తా : కిసాన్ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి




**కీసర, మే 05, (తెలంగాణ దిశ)** :కీసర మండలంలో టాప్ ర్యాంక్ సాధించిన యామిని రాంపల్లికి గర్వకారణమని కిసాన్ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి అన్నారు. కీసర మండలం రాంపల్లి గ్రామానికి చెందిన ఓరగంటి బాలరాజు, స్వాతి దంపతుల కుమార్తె ఓరగంటి యామిని పదవ తరగతి ఫలితాల్లో 530 మార్కులు సాధించి కీసర మండలంలో మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకోవడం రాంపల్లికి గర్వకారణంగా మారిందన్నారు.

రాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న యామిని తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంటుంది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఏనుగు రాజిరెడ్డి యామినిని ఘనంగా సన్మానించారు. ఆమె విద్యాభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ ఇంటర్ కాలేజ్‌కు సంబంధించిన పూర్తి ఫీజును తానే భరిస్తానని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ యామిని చదువుకు తాను పూర్తిగా బాధ్యత వహిస్తానని, ఆమె ఉన్నత స్థాయికి చేరుకునే వరకు అండగా నిలుస్తానని తెలిపారు.

భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించి రాంపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, ఉపాధ్యక్షులు రామారం గిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా- మల్కాజిగిరి సర్కిళ్ల మధ్య చెత్త వివాదం



**హెచ్ బి కాలనీ, మే 05, (తెలంగాణ దిశ)** :కాప్రా, మల్కాజిగిరి సర్కిళ్ల మధ్య హెచ్ బి కాలనీలో చెత్త వివాదం ప్రజలకు ఇబ్బందిగా తయారైంది. ఇది తమ పరిధి కాదంటూ శానిటేషన్ సిబ్బంది తప్పించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. చెత్త వల్ల దుర్వాసన, దోమల సమస్యలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు అంటున్నారు.వెంటనే చెత్త తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సంపాదకీయం

## రాజకీయ ప్రత్యర్థులుగా ఆడపడుచులు..

సాధారణంగా రాజకీయ పార్టీలు వేర్వేరు మార్గాల్లో వెళ్తుంటాయి. సిద్ధాంతాలతో పాటు భావజాలం వేరువేరుగా ఉంటుంది. అంతిమంగా ప్రజలకు మేలు చేయడమే కానీ.. వెళ్లే మార్గాలు వేర్వేరుగా ఉంటాయి. కానీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన విపక్షాలుగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలు ఒకే సారూప్యతతో ముందుకు వెళ్లడం విశేషం. చాలా అంశాల్లో ఆ రెండు పార్టీలు ఒకే విధానంతో ముందుకు వెళ్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఒకే రకమైన వ్యవహార శైలి.. ఒకే రకమైన భావజాలం రెండు పార్టీల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది.అలా జరుగుతుందా కేసీఆర్, జగన్ నేతలూ మూడో ఫ్రంట్ కడతారా. దేశ రాజకీయాల్లో కీలకమైన మలుపు తిప్పుతారా ఇవన్నీ ప్రశ్నలే. ఇంకా చెప్పాలీ అంటే ఊహాగానాలే కూడా. ఎందుకంటే ఈ ఇద్దరూ రాజకీయంగా మంచి స్నేహితులు అని ప్రచారంలో ఉన్నా ప్రస్తుతం ఇద్దరి రాజకీయాలూ కొంత ప్రతికూల వాతావరణంలో సాగుతున్నాయి. ఇద్దరూ మాజీ సీఎంలు అయ్యారు. ఇద్దరూ విపక్షంలోకి వచ్చేసారు. రెండు చోట్లా బలమైన ముఖ్యమంత్రులతో పోరాటం చేయాల్సి వస్తోంది. దానికి తోడు ఇద్దరి రాజకీయ ప్రత్యర్థులు వేరుగా ఉన్నారు. ఏపీలో టీడీపీతో జగన్ ఫైట్ చేస్తున్నారు. అవతల కాంగ్రెస్ తో కేసీఆర్ రాజకీయ యుద్ధం చేస్తున్నారు. అంతే కాదు జగన్ బీజేపీ పట్ల సాఫ్ట్ కార్నర్ తో ఉ ంటున్నారు. కేసీఆర్ కి తెలంగాణాలో బీజేపీ కూడా ఒక రాజకీయ ప్రత్యర్థి గానే ఉంది అన్నది రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు ఇదిలా ఉంటే కేంద్రంలోని బీజేపీ నాయకత్వం లో నడిచే ఎన్డీయే ప్రభుత్వం ఏ బిల్లు ప్రవేశపెట్టినా జగన్ పార్టీ వైసీపీ మద్దతు ఇస్తోంది. తాజాగా డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది అంతా కూడా తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని గగ్గోలు పెడుతున్న వేళ జగన్ మద్దతు ఇచ్చారు. అక్కడితో ఆగకుండా ఆయన జాతీయ స్థాయిలో విపక్షాల తీరుని గట్టిగా విమర్శించారు. బీజేపీకి మద్దతుగా మాట్లాడారు. ఇదే మరింతగా న్యూట్రల్ రాజకీయ వర్గాలకు సైతం ఆగ్రహం కలిగేలా చేసింది అని అంటున్నారు. జగన్ బీజేపీకి సరెండర్ అయిపోయారు అంటూ కాంగ్రెస్ సహా ఇతర పార్టీల నుంచి విమర్శలు వచ్చిపడ్డాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కి అత్యంత సన్నిహితుడు జగన్ వైసీపీని పెట్టిన తొలి నాళ్ళలో ఆయనతో కలిసి పనిచేసిన మాజీ ఎమ్మెల్యే సీనియర్ నాయకుడు గోనే ప్రకాశరావు అయితే జగన్ తీరుని పూర్తిగా తప్పుపట్టారు. జగన్ ఉంటే ఎన్డీయేలో ఉండాలి లేకపోతే ఇండియా కూటమిలో ఉ ండాలి. అటూ ఇటూ కాకుండా ఏమిటీ రాజకీయ వైఖరి అంటూ గోనె దుయ్యబెట్టారు. కాంగ్రెస్ కి మద్దతు ఇవ్వడం ఇష్టం లేకపోతే కేసీఆర్ తో కలసి జగన్ మూడో ఫ్రంట్ ఏర్పాటు చేసుకోవచ్చు కదా అని కీలక సలహా కూడా ఇచ్చారు. మీ ఇద్దరూ మిత్రులే కదా అని కూడా అన్నారు. ఈ విధంగా బయట ఉంటూ ఎన్డీయేకు మద్దతు ఇవ్వడమేంటని ఎకసెక్కమాడారు. స్టూడెంట్స్‌పై వేధింపుల ఆరోపణలు నిజమేగోనె ప్రకాశరావు ఇచ్చిన సలహా బాగానే ఉన్నా అది కుదిరే పనేనా అని అంటున్నారు. కేసీఆర్ సీఎం గా ఉన్నపుడు బీఆర్ఎస్ పేరుతో ప్రయోగాలు చేసిందే మూడో ఫ్రంట్ కోసం. కానీ అసలుకే ఎసరు వచ్చింది.. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఎప్పుడు ఫామ్ హౌస్ కే పరిమితం అవుతున్నారు. ఆయన ప్రజల్లోకి వచ్చింది చాలా తక్కువ. అలాగని అసెంబ్లీకి వెళ్ళరు. టైగర్ కు టైం వచ్చింది అంటూ పార్టీ శ్రేణులు గర్వంగా చెబుతుంటాయి. కానీ ఆయన ప్రజల్లోకి వచ్చింది లేదు. ఏపీలో జగన్మోహన్ రెడ్డి తీరు సైతం అలానే ఉంటుంది. ఆయన ప్యాలెస్ ల చుట్టూ తిరుగుతుంటారు. వారంలో నాలుగు రోజులపాటు బెంగళూరు ఎలాహంక ప్యాలెస్ లో ఉంటారు. మూడు రోజులు తాడేపల్లి ప్యాలెస్ లో గడుపుతారు. ఇప్పుడు హైదరాబాద్ ప్యాలెస్ కి వెళ్తానంటున్నారు. ఈయన సైతం అసెంబ్లీకి హాజరు కావడం లేదు. ప్రజల మధ్యకు వచ్చే సాహసం చేయడం లేదు. అయినా సరే వచ్చే ఎన్నికల్లో తమదే అధికారం అని ఈ ఇద్దరు నేతలు చెబుతున్నారు.ఎన్డీఏ ప్రభుత్వం విషయంలో సైతం వీరు సానుకూలంగానే ఉంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అయితే కెసిఆర్ ప్రధాని నరేంద్ర మోడీని టార్గెట్ చేసుకుంటూ మాట్లాడేవారు. వ్యక్తిగత విమర్శలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ కేంద్రానికి చిన్న విమర్శ కూడా చేయడం లేదు. జగన్మోహన్ రెడ్డి తీరు గురించి చెప్పనవసరం లేదు. విమర్శలు చేయలేదు సరి కదా.. తిరిగి వ్యతిరేక కూటమికి మద్దతు తెలుపుతున్నారు. అప్పట్లో ప్రత్యేక హోదా విషయంలో చిన్నపాటి విమర్శలు కూడా చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదు. రెండు పార్టీలకు ఆడపడుచుల బెడద తప్పడం లేదు. ఏపీలో సోదరుడు జగన్మోహన్ రెడ్డిని విభేదిస్తున్నారు షర్మిల. రాజకీయ ప్రత్యర్థులుగా మారిపోయారు. తెలంగాణలో సోదరుడు కేటీఆర్ తో పాటు తండ్రిని వ్యతిరేకిస్తున్నారు కవిత. ఘాటైన విమర్శలు చేస్తూ సొంత పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు చేసుకుంటున్నారు కవిత. అయితే ఈ ఇద్దరు ఆడబిడ్డలకు సోదరుల కాలకేయ సోషల్ మీడియా సైన్యం చుక్కలు చూపిస్తోంది. మరోవైపు ఏపీలో జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో కేటీఆర్ పాదయాత్రలకు సిద్ధపడుతున్నారు. వారికి పోటీగా చెల్లెలు సైతం పాదయాత్ర దిశగా ఆలోచనలు చేస్తున్నారట. మరోవైపు జగన్మోహన్ రెడ్డి బయటకు వస్తే ఎలివేషన్లు మామూలుగా ఉండవు. చిన్నపిల్లల సీన్ క్రియేట్ చేస్తారు. జగన్ మామయ్య అంటూ గుక్క తిప్పి ఏడుస్తారు. అయితే ఈ ఎలివేషన్లు వెనుక ఐప్యాక్ హస్తం ఉంటుంది. అటువంటిదే ఇటీవల తెలంగాణలో కెసిఆర్ కూడా చేసి చూపించారు. జగిత్యాల సభకు వెళ్తున్న క్రమంలో ఓ తండ్రి చెంతనే ఉన్న పిల్లకు ఫ్లయింగ్ కిస్ ఇచ్చి ఆశ్చర్యపరిచారు. అదంతా ఎలివేషన్లలో భాగమేనని తెలుస్తోంది. ఇలా ఆ రెండు పార్టీల భావసారుప్యత ప్రతి దాంట్లోనూ కనిపిస్తోంది.ఇపుడు తెలంగాణాలో అధికారం దక్కించుకోవడమే కేసీఆర్ ప్రధాన లక్ష్యం. జగన్ విషయం చూస్తే ఆయన ఏపీ గడప దాటి బయట రాజకీయాలు చేసేందుకు అసలు ఇష్టపడరు. కేవలం ఆంధ్రాకే పరిమితం అవుతూ వస్తున్నారు. పైగా బీజేపీ పట్ల సానుకూలంగా ఉంటూ వస్తున్నారు. దానికి కారణం ఎవరికీ తెలియదు కానీ కాంగ్రెస్ వ్యతిరేకత అని అంటున్నారు. ఇక 2029 లో దేశంలో రెండే కూటములు పోటీ పడే సీన్ ఉంది. అవి ఎన్డీయే ఇండియా కూటములు. జగన్ కి ఇండియా కూటమి బహు దూరం. అందులో కాంగ్రెస్ ఉంది కాబట్టి చేరే ప్రసక్తి లేదు. అలాగని ఎన్డీయేలో చేరాలీ అంటే అందులో ఇప్పటికే చంద్రబాబు పవన్ ఉ న్నారు. పైగా తనకు ఉన్న మైనారిటీ ఓట్లు పోతాయని జగన్ బాహాటంగా పొత్తు పెట్టుకోరు. అలాగని బీజేపీకి కాంగ్రెస్ కి సమ దూరం పాటించేది కూడా లేదని అంటున్నారు. మొత్తం మీద జాతీయ స్థాయిలో వైసీపీది ఒక నిలకడ లేని రాజకీయం అని ప్రత్యర్థులు విమర్శిస్తున్నా వైసీపీ అధినాయకత్వం మాత్రం తన రూటే సెపరేట్ అంటోంది. సో మూడో ఫ్రంట్ ముచ్చట అయితే జగన్ కేసీఆర్ లు చేసేది ఉండదనే అంటున్నారు. ఒకవేళ బీజేపీ ఓటమి చెంది కేంద్ర రాజకీయాల్లో మూడవ కూటమిగా ఎవరైనా ముందుకు వస్తే అందులో వైసీపీ కీలకంగా వ్యవహరించవచ్చు అని అంటున్నారు. అలాంటి కూటమికి కేసీఆర్ మద్దతు కూడా ఉండే చాన్స్ ఉందని అంటున్నారు.

## సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను తక్షణమే పరిష్కరించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 05, (తెలంగాణ దిశ) :**సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ ఆఫీస్‌ను కీసర ఆర్డీఓ రాజేష్ కుమార్ తో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాదా బైనామా, భూ భారతి పెండింగ్ లో ఉన్న అప్లికేషన్లను పూర్తి చేయాలని తహసీల్దారును ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూమి రికార్డుల సమగ్ర పోర్టల్ భూ భారతిలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా, భూ భారతి రికార్డులను అదనపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహాసీల్దారు చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా సంఘాలకు సహకరిస్తాం

### - మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి



**హైదరాబాద్, మే 05, (తెలంగాణ దిశ) :**రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కొరకు క్రీడా సంఘాలు నిర్వహించే అన్ని కార్యక్రమాల విజయవంతానికి సంపూర్ణంగా సహకరిస్తామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డిలు తెలిపారు. ఈరోజు ఎల్ బి స్టేడియంలో ఈ నెల 09, 10 తేదీలలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్అధికారిక బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ చాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోతెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం. మహిపాల్ గారు, ఆర్ఆర్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం. నర్సింగ్ రావు , హైదరాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం. ప్రవీణ్ కుమార్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎన్. సంతోష్ పాల్గొన్నారు. తెలంగాణలో కిక్ బాక్సింగ్ అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

## హనుమాన్ జన్మోత్సవ శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు

**కుషాయిగూడ, మే 05, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడలో శ్రీ హనుమాన్ జన్మోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 12న సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ శోభాయాత్రకు భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. స్థానిక యువత, భక్తులు కలిసి ఈ కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేకంగా సన్నాహాలు చేస్తున్నారు. శోభాయాత్రలో భజనలు, డోలు వాయిద్యాలు, ఆకర్షణీయ అలంకరణలతో హనుమంతుడి విగ్రహం ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రాంతంలోని పలు కాలనీల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. భక్తుల సౌకర్యార్థం తగిన భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు కూడా చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామ



భక్త హనుమంతుడి ఆశీస్సులతో ప్రాంతంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలి

### - మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి



**కుత్బుల్లాపూర్, మే 05, (తెలంగాణ దిశ) :** మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని మహిళా కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం మహిళా కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు చల్లా మాధవి రెడ్డి అధ్యక్షతన పోస్ట్ కార్డులపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలుఅల్కాలాంబ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచనల మేరకు మేడ్చల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఏ బ్లాక్ రేణుక రెడ్డి సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు కీలకమని అన్నారు. దేశంలో మహిళల సాధికారతకు ఇది ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. బిల్లును ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మెరుగు సునీత, జాజాల రమ్య, కొంపల్లి మున్సిపల్ ఉపాధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి మమత కార్యదర్శి రాధా, సహాయ కార్యదర్శి రాణమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## భజనలు, భక్తి గీతాలతో కుషాయిగూడలో ఆధ్యాత్మిక శోభ



**కుషాయిగూడ, మే 05, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడ బస్టాండ్ ప్రాంగణం భక్తి పరవశంతో కళకళలాడుతుంది. ఇక్కడ ప్రతిష్ఠించిన 54 అడుగుల భారీ 'బాహుబలి' ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రతి రోజు భజనలు, భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది. గత ఐదు రోజులుగా వేలాదిమంది భక్తులు బాహుబలి హనుమాన్ విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సమీప ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. హనుమాన్ మాలలు ధరించిన భక్తులు గుంపులుగా చేరి భజనలు, కీర్తనలు ఆలపిస్తూ భక్తి సంద్రాన్ని సృష్టిస్తున్నారు. బస్టాండ్ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక కాంతితో నిండిపోయింది. భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతుంది. భక్తి, శ్రద్ధల సమ్మేళనంగా నిలిచిన ఈ బాహుబలి హనుమాన్ విగ్రహం కుషాయిగూడలో ఆధ్యాత్మిక కేంద్రంగా మారి, సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని మరింత బలపరుస్తుంది.


## తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, మే 05, (తెలంగాణ దిశ) :**కాప్రా సర్కిల్ కాలనీలలో అంతరాయం లేకుండా నాణ్యమైన తాగునీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. గత 15 రోజులుగా కుషాయిగూడ డివిజన్‌లో నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కాలనీ కమిటీలు వినతిపత్రం సమర్పించాయి. బోర్లు ఎండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లీకేజీ పైపులైన్‌లను తక్షణమే మరమ్మతు చేసి సరఫరా పునరుద్ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈ నెల 11న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భారీ జాబ్ మేళా

**మేడ్చల్ , మే 05, (తెలంగాణ దిశ) :**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ స్టేడియంలో భారీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా మార్కెటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్, హెల్త్ కేర్, ఐటీ, కమ్యూనికేషన్ రంగాలకు చెందిన సుమారు 50కు పైగా సంస్థలు ఉద్యోగ అవకాశాలను అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు ముందస్తుగా ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందు కోసం వెబ్ సైట్ ద్వారా లేదా ప్రకటనలో ఇచ్చిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నమోదు చేసుకోవచ్చునన్నారు. నమోదు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ షెడ్యూల్ వివరాలు ఎస్ఎంఎస్ లేదా ఈ మెయిల్ ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాలను పొందాలని అధికారులు కోరారు. మరిన్ని వివరాలకు 7660919518 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## సోయాబీన్ దిగుబడిలో గ్యాప్..

### రైతు ఆదాయానికి ముప్పు.. శాస్త్రీయ సాగుతోనే లాభాల పెరుగుదల పరిశోధనాధ్యయనంలో వెల్లడి...

ఉత్తర తెలంగాణలో సోయాబీన్ సాగులో గణనీయమైన దిగుబడి వ్యత్యాసాలు బయటపడటం రైతు ఆర్థిక స్థితిపై ఆందోళన కలిగిస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రం గతంలో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, శాస్త్రీయ పద్ధతులు పాటించే ప్రోగ్రెసివ్ రైతులు మరియు సాధారణ రైతుల మధ్య ఉ త్పత్తి, ఆదాయంలో స్పష్టమైన తేడా ఉన్నట్లు వెల్లడైంది. సోయాబీన్ (Glycine max) ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం పొందిన నూనె గింజ పంట. అధిక ప్రోటీన్, మట్టిలో నత్రజని స్థిరీకరణ లక్షణాలు, పరిశ్రమల్లో విస్తృత వినియోగం దీని ప్రత్యేకత. భారతదేశంలో ఖరీఫ్ పంటలలో ముఖ్య స్థానం సంపాదించినప్పటికీ, ఉత్పాదకత మాత్రం అంతర్జాతీయ స్థాయికి చేరుకోలేకపోతోంది.

ఉత్తర తెలంగాణలో అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ, పరిశోధనా స్థాయి దిగుబడులు మరియు రైతుల వాస్తవ దిగుబడుల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. అధ్యయనం ప్రకారం పరిశోధనా కేంద్రంలో ఎకరానికి సగటు 10 క్వింటాళ్ల దిగుబడి నమోదవుతుండగా, ప్రోగ్రెసివ్ రైతులు 8.17 క్వింటాళ్లు, సాధారణ రైతులు కేవలం 6.20 క్వింటాళ్లు మాత్రమే సాధిస్తున్నారు. ఈ వ్యత్యాసం రైతుల ఆదాయంపై నేరుగా ప్రభావం చూపుతోంది.

ఆర్థిక పరంగా కూడా ఈ తేడా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రోగ్రెసివ్ రైతులు ఎకరానికి సగటున సుమార్ 30 వేల రూపాయల వరకూ ఖర్చు పెట్టి అధిక దిగుబడి సాధిస్తుండగా, సాధారణ రైతులు తక్కువ ఖర్చుతో సాగు చేసినా లాభాలు పరిమితంగా ఉన్నట్లు తెలియవచ్చింది. సాధారణ రైతులకు ఎకరానికి సగటు లాభం రెండు వేల రూపా యల లోపే ఉండగా, ప్రోగ్రెసివ్ రైతులు దానికి నాలుగు రెట్లు అధి కంగా సంపాదిస్తున్నారని తెలిసింది. లాభం, ఖరీదుల నిష్పత్తి కూడా ప్రోగ్రెసివ్ రైతుల వద్ద 1.33గా ఉండగా, సాధారణ రైతుల వద్ద అది 1.06కి పరిమితమవుతోందని అధ్యయనంలో తెలిసింది.

# జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వానికి టీఎస్ జెయు కృతజ్ఞతలు

## అక్రిడిటేషన్ల జారీతో పాటు, జూన్ 2 నాటికి ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం



**హైదరాబాద్, మే 05, (తెలంగాణ దిశ) :** తెలంగాణలో జర్నలిస్టుల చిరకాల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు)' పక్షాన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ, ఐ అండ్ పీఆర్ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు టీఎస్ జెయురాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి టి. అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో గుర్తింపునకు నోచుకోక ఇబ్బందులు పడిన ప్రింట్, ఎలక్ట్రానిక్, కేబుల్ ఛానల్స్ జర్నలిస్టులకు, వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు జీఓ 252 ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసే గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. గత ప్రభుత్వం కేవలం 23,352 మందికే అక్రిడిటేషన్లను పరిమితం చేయగా, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఏకంగా సుమారు 46 వేల మందికి పైగా అర్హులైన జర్నలిస్టులందరికీ ఈ అవకాశాన్ని విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మే 1న జిల్లాల్లో కలెక్టర్ల ద్వారా కార్డుల పంపిణీకి ఆదేశాలు జారీ చేయడం, దరఖాస్తులకు మే 10వ తేదీని తుది గడువుగా నిర్ణయించడం, అర్హులైన జర్నలిస్టులందరికీ మెరుగైన ఆరోగ్య, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తామని ప్రకటించడం జర్నలిస్టులకు కొండంత భరోసాను ఇచ్చిందన్నారు. ఏప్రిల్ 30తో ముగుస్తున్న బస్ పాస్‌ల గడువును పొడిగించడం ఎంతో ఊరటనిచ్చిందన్నారు. ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు – జూన్ 2 నాటికి పరిష్కారంతో పాటు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులు చారిత్రాత్మకమన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్





రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో వివిధ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలతో సమావేశమై.. జూన్ 2వ తేదీ (తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం) నాటికి న్యాయ పరమైన చిక్కులు లేకుండా ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకమైన 'ఫ్యూచర్ సిటీ'లో ఎమ్మెల్యేలు, అధికారులతో పాటు జర్నలిస్టులకు కూడా స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి సానుకూలంగా ఉండటం ఆయన దార్శనికతకు నిదర్శనమన్నారు. 18 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ సహా ఇతర సొసైటీల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు, జర్నలిస్టు సంఘాల్లో సభ్యులు కాని అర్హులైన వారికి కూడా న్యాయం చేసేందుకు మంత్రి పొంగులేటి తీసుకుంటున్న చొరవ అభినందనీయమన్నారు. అందరూ ఒకే వేదికపైకి వచ్చి జేఏసీగా ఏర్పడాలన్న మంత్రి సూచనను టీఎస్ జెయు స్వాగతిస్తుందన్నారు. ఈ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న సమాచార, పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

**జర్నలిస్టుల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి**

గత (బీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో పత్రికా స్వేచ్ఛను హరించి, జర్నలిస్టులను దుర్భాషలాడిన ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా పురుషోత్తం నారగౌని అధ్యక్షతన ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించామని గుర్తు చేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా ఆ ధర్నాకు హాజరై, మా పోరాటానికి, జర్నలిస్టులకు అండగా నిలబడ్డ వాస్తవాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. నాడు ప్రతిపక్ష నాయకుడిగా జర్నలిస్టుల కష్టాలను కళ్లారా చూసిన రేవంత్ రెడ్డి, నేడు ముఖ్యమంత్రి హోదాలో జర్నలిస్టులకు ఈ ప్రయోజనాలను కల్పిస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మంత్రివర్గ సభ్యులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.



### 30 సంవత్సరాల తర్వాత రాం సాగర్ గ్రామానికి..

# జనగామ డిపో బస్ సర్వీస్ రాక



**కొమురవెల్లి,తెలంగాణ దిశ :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని రాం సాగర్ గ్రామానికి 30 సంవత్సరాల తర్వాత జనగామ డిపో వారి సేవలు అందించినందుకు రాంసాగర్ గ్రామా ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన బస్ సర్వీసును విజయవంతం చేశారు. అనంతరం జనగామ డిపో అధికారులకు రాంసాగర్ గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. రాంసాగర్ గ్రామ సర్పంచ్ అక్కేనపల్లి రాజ్యాలక్ష్మి మల్లారెడ్డి మరియు ఉప సర్పంచ్ ఏసి రెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన ఈ నూతన బస్ సర్వీసును ప్రారంభించడం జరిగింది. ముందుగా జనగామ డిపో బస్ సర్వీస్ కు నీటితో అభిషేకం చేసి పసుపు కుంకుమతో అగరత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళా హారతి ఇచ్చి కొబ్బరికాయలు సమర్పించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ డ్రైవర్ కు కండక్టర్ కు శాలువాతో సత్కరించారు. రాంసాగర్ గ్రామ ప్రజలు జనగామ డిపో బస్ రావడంతో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ నూతన బస్ మధ్యాహ్నం జనగామ డిపో రెండు గంటలకు బయలుదేరి బచ్చన్నపేట చేర్యాల కడవేర్గు రాంసాగర్ కొమురవెల్లి దేవాలయం కొమురవెల్లి విలేజ్ కొమురవెల్లి కమాన్ నుండి ప్రజ్ఞాపూర్ మీదుగా సికింద్రాబాద్ కు చేరుకుంటుంది. తిరిగి జేబీఎస్ నుండి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి తుర్కపల్లి ఒంటిమామిడి గౌరారం ప్రజ్ఞాపూర్ కుకునూరు పల్లి కొమురవెల్లి కమాన్ కొమురవెల్లి విలేజ్ కొమురవెల్లి దేవాలయం రాంసాగర్ కడవేర్గు చేర్యాల నైట్ హాల్ చేస్తుంది. తిరిగి మరుసటి రోజు ఉ



దయం 5 గంటలకు చేర్యాల నుండి బయలుదేరి కడవేర్గు రాం సాగర్ కొమురవెల్లి దేవాలయం కొమురవెల్లి విలేజ్ కొమురవెల్లి కమాన్ నుండి కుకునూరుపల్లి ప్రజ్ఞాపూర్ గౌరారం తుర్కపల్లి వంటిమామిడి శామీర్పేట్ జేబీఎస్ కు ఉదరం 7:30 వరకు చేరుకుంటుంది. తిరిగి జేబీఎస్ నుండి బయలుదేరి రీశాల బజార్, లోతుకుంట, హకీంపేట్, షామీర్పేట్, ఒంటిమామిడి, తుర్కపల్లి, గౌరారం, ప్రజ్ఞాపూర్, కుకునూరు పల్లి, కొమురవెల్లి కమాన్, కొమురవెల్లి విలేజ్. కొమురవెల్లి దేవాలయం, రాంసాగర్ కడవేర్గు చేర్యాల నుండి బచ్చన్నపేట జనగామ ఉదయం 11 గంటల వరకు చేరుకుంటుంది. ఈ చదవకా శాన్ని చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు ప్రయాణి కులు బంధువులు స్నేహితులు ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగి ంచుకొని జనగామ డిపో అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు సహకరిం చాలని రాం సాగర్ గ్రామ ప్రజలు కోరారు.ఈ కార్యక్రమంలో రాం సాగర్ గ్రామ సర్పంచ్ అక్కేనపల్లి రాజ్యాలక్ష్మి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ ఏసి రెడ్డి మల్లారెడ్డి, వార్డు సభ్యులు, గంగుల ఐలయ్య, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ నూతన బస్ సర్వీస్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు**

భద్రాద్రి: జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా పరిస్థితులపై జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులు, రీజినల్ మేనేజర్లు, ఏరియా మేనేజర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన సరఫరా వ్యవస్థలో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై స్పష్ట మైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా విషయంలో ఎటువంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో రిటైల్ స్థాయిలో అపోహల కారణంగా అనవసర గందరగోళం ఏర్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ముందస్తు కొనుగోళ్లు చేయకుండా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వరి కోత యంత్రాలు, రవాణా లారీలు, వ్యవసాయ యంత్రాలకు ఇంధన సరఫరాలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పెట్రోల్ బంక్‌పై క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచాలని, తాహసిల్దారులు బంకుల రికార్డులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇండెంట్ బుకింగ్ విధానాన్ని ముందుగానే సమర్థవంతంగా అమలు చేయాలని, అవసరమైన చోట ముందస్తు బుకింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి అధిక మొత్తంలో డీజిల్ కొనుగోలు జరిగే అవకాశం ఉన్నందున అటువంటి కార్యకలాపాలు పునరావృతం కాకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి వేదికల ద్వారా




జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందని తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇటువంటి ప్రచారాల వల్ల ప్రజల్లో భయాందోళనలు ఏర్పడి అనవసరంగా ముందస్తు కొనుగోళ్లు జరుగుతున్నాయని, జిల్లాలో ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. రిటైల్ అవుట్‌లెట్ల వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, పౌరసరఫరాల శాఖతో పాటు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ, పారిశ్రామిక అవసరాల పేరుతో అధిక మొత్తంలో డీజిల్ నిల్వచేసి బ్లాక్ మార్కెటింగ్ లేదా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల స్టాక్ వివరాలను వెంటనే సమగ్ర నివేదిక రూపంలో సమర్పించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ ను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమై న బందోబస్తు ఏర్పాటు చేయడం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జరిగే పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లు మరియు రవాణాను అరికట్టవచ్చని తెలిపారు. రిటైల్ అవుట్‌లెట్లపై పౌరసరఫరాల శాఖతో కలిసి నిరంతర పర్యవేక్షణ అవసరమని అన్నారు . బ్లాక్ మార్కెట్ లేదా అక్రమ రవాణాలో పాల్గొనేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# భూముల విలువల సవరణ



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను మే మొదటి వారం నుంచి సవరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉపసంఘం దీనిపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య చైనా తరహా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేయడంతో పాటు 'హిల్ట్' విధానం ద్వారా పారదర్శక పద్ధతిలో భూ వినియోగ మార్పిడి చేపడతామని స్పష్టం చేసింది. పారిశ్రామికవేత్తల సూచనల మేరకు రాయితీలు, కొత్త జోన్ల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది.తెలంగాణలో ఆదాయ వనరుల పెంపుదల, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం దూకుడు పెంచింది. సచివా లయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు పారిశ్రామిక ఎస్టేట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తూనే.. భూ విలువల సవరణ ద్వారా ఖజానాకు అదనపు ఆదాయాన్ని చేకూర్చడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం చెబుతోంది. పారిశ్రామిక రంగానికి సంబంధించి అనేక వినూత్న ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాలను చైనా తరహాలో ప్రత్యేక పారిశ్రామిక పార్కులుగా అభివృద్ధి చేయాలని పారిశ్రామికవేత్తలు కోరగా.. ప్రభుత్వం దానికి సానుకూలత వ్యక్తం చేసింది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ విధానాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎటువంటి నగదు బదిలీలకు తావులేకుండా అమలు చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. పరిశ్రమల వల్ల కాలుష్యం ఉండకూడదని అదే సమయంలో అవి లాభసాటిగా నడవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.అయితే హిల్ట్ పాలసీపై రాజకీయంగా తలెత్తుతున్న కొన్ని విమర్శలను పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు కొట్టిపారేశారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విధానం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని కొందరు నేతలు భయపెట్టే ప్రయత్నం చేశారని కానీ పారదర్శకమైన ఈ విధానంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని తాము భావిస్తున్నట్లు తెలిపారు.

### పార్క్‌లో చెట్లు తొలగింపు..

# జీహెచ్ఎంసీ నిర్లక్ష్యమా?

- బీహెచ్ఈఎల్ మాక్ సొసైటీలో ఘటనపై అధికారులపై విమర్శలు
- వృక్షాల తొలగింపుతో పార్క్ రూపురేఖలు మార్పు
- రోజులు గడిచినా జీహెచ్ఎంసీ నుంచి స్పందన లేదు
- అనుమతులు లేకుండానే చర్యలపై ఆరోపణలు
- చెట్ల ఆనవాళ్లు కనిపించక మరిన్ని సందేహాలు





**పటాన్ చెరు,తెలంగాణ దిశ :**భారతి నగర్ డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ మాక్ సొసైటీ పార్క్‌లో జరిగిన వృక్షాల తొలగింపు ఘటనపై జీహెచ్ఎంసీ అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏండ్లుగా పెరిగిన చెట్లను ఒక్కసారిగా తొలగించడంతో పార్క్‌లోని పచ్చదనం దెబ్బతింది. స్థానికుల వాదన ప్రకారం, ఈ చర్యలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా అన్నది స్పష్టంగా తెలియడం లేదు. ఇంత పెద్ద స్థాయిలో చెట్ల తొలగింపు



జరగడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తోందని వారు అంటున్నారు. ఈ సంఘటన జరిగి వారం రోజులు గడిచినా జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది.

# హైదరాబాద్ లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు




హైదరాబాద్,: దేశంలోని మెట్రో నగరాలు ఒక్కో రంగంలో కీలక హబ్‌లుగా ఉన్నాయి. బెంగళూరు ఐటీ, పరిశోధనాభివృద్ధికి, ముంబై బీఎఫ్ఎస్ఐకి, హైదరాబాద్ ఫార్మా, ఐటీ, కృత్రిమ మేధస్సుకు, పుణె ఇంజనీరింగ్‌కు, ఢిల్లీ, ఎన్‌సీఆర్ ఈ కామర్స్, చెన్నై తయారీ రంగాలకు కేంద్రాలుగా ఉన్నాయి. ఖర్చును ఆదా చేసే కేంద్రాల నుంచి ఆవిష్కరణ, విలువ ఆధారిత సేవలకు వ్యూహాత్మక కేంద్రాలుగా అవి రూపాంతరం చెందుతున్నాయి. జీసీసీలు అనేవి బహుళ జాతి సంస్థల ఆఫ్‌షోర్ యూనిట్లు. ఇవి ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలను ఏకీకృతం చేసి కేంద్రాలు. దేశంలో కృత్రిమ మేధస్సు(ఏఐ), మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయి. భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు అమెరికాకు చెందిన కంపెనీలే ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నాయి. 2021 నుంచి ఇండియాలో జరిగిన జీసీసీ లీజులలో యూఎస్ కంపెనీల వాటా ఏకంగా 70 శాతంగా ఉందంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు, గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజాలు ఈ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. ఇతర దేశాల్లోని ప్రతిభావంతుల సేవలను, కార్యనిర్వహణ సామర్థ్యాన్ని తక్కువ ఖర్చుతో ఉపయోగించుకోవడానికి ఎంఎన్‌సీ కంపెనీలు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేస్తాయి. వాటినే గ్లో బల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ)గా పిలుస్తారు. ఆ కంపెనీలు తమ వ్యాపార వృద్ధికి ఈ కేంద్రాలలోని మానవ, సాంకేతిక వనరులను వినియోగించుకొంటాయి. హైదరాబాద్ కేంద్రం గా నడిచే జీసీసీలు దేశవ్యాప్తంగా స్టార్టప్ కల్చర్‌కు దశ, దిశను చూపుతున్నట్టు నిపుణులు చెప్తున్నారు. దేశంలో జీసీసీల లిస్టులో చూస్తే బెంగళూరు అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత మూడో స్థానంలో ఉన్న చెన్నై కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఫార్మా, బయోటెక్ రంగాల్లో కార్యకలాపాలు సాగించే కంపెనీలకు హైదరాబాద్ మొదటి ఎంపికగా నిలుస్తుందని రిపోర్టుల్లో తెలిసింది.ప్రపంచ దిగ్గజ కంపెనీలు తమ గ్లోబల్ కేపబులిటీ సెంటర్లను (ఉఅఅ) హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి క్యూకట్టాయి. జీసీసీలను ఆకర్షించడంలో 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా పిలిచే బెంగళూరును తోసిరాజని హైదరాబాద్ ముందువరుసలో నిలిచిందంటే కేసీఆర్ ప్రభుత్వం వేసిన అప్పటి 'ఐటీ' పునాదులేనని చెప్పకతప్పదు. గ్లోబల్ టెక్ కంపెనీలను ఏర్పాటు చేయడమే కాదు సుశిక్షితులైన ఉద్యోగులను కూడా అందిస్తూ మల్టీనేషనల్ కంపెనీలను ఆకర్షించడంలో హైదరాబాద్ దేశానికే దిక్సూచీగా నిలిచింది. అందుకే గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల(జీసీసీ)కు కేంద్ర బిందువుగా హైదరాబాద్ మారింది. దేశవ్యాప్తంగా రెండు వేల జీసీసీ ఎకో సిస్టమ్‌లుండగా.. హైదరాబాద్‌లోనే 355 జీసీసీలున్నాయి. దేశంలో కొత్తగా ప్రారంభించే ప్రతీ 100 జీసీసీల్లో 18 సెంటర్లు హైదరాబాద్‌లోనే కొలువుదీరుతున్నాయి. తద్వారా దేశంలో అత్యధికంగా జీసీసీ సెంటర్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. హైదరాబాద్‌లోని మొత్తం జీసీసీల్లో 3 లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారు. వచ్చే ఐదు నుంచి ఏడేండ్ల కాలంలో 35-40 శాతం కొత్త జీసీసీలు మన దేశంలో ప్రారంభం కానున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. వాటన్నింటికీ గమ్యస్థానం హైదరాబాద్ కాబోతున్నట్టు పారిశ్రామిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఐటీ, రీసెర్చ్, ఫైనాన్స్, కస్టమర్ సేవల కోసం ఎంఎన్‌సీలు హైదరాబాద్‌లో ఇప్పటికే వందలాది జీసీసీలను ఏర్పాటు చేశాయి. టెక్ కంపెనీలు కూడా తమ వ్యాపార విస్తరణకోసం జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లు ఏర్పాటు చేస్తున్నాయి.

ప్రతి సంవత్సరం 100 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్లు అంటే భారత దేశ కరెన్సీలో సుమారు రూ. 860 కోట్ల నుంచి రూ. 8600 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న మధ్య స్థాయి టెక్ కంపెనీలు ఏర్పాటు చేస్తోన్న జీసీసీ కేంద్రాలను మధ్య స్థాయి మార్కెట్ జీసీసీలుగా చెబుతారు. ఈ జీజీసీలు టెక్నాలజీ పరిశ్రమ విస్తరణలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్లు నాస్కామ్- జిన్నోవా రిపోర్ట్ తెలిపింది. అందులో చాలా కంపెనీలు హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని జిసిసి సెంటర్లను ప్రారంభించాయి. మధ్య స్థాయి టెక్ కంపెనీల జీసీసీల్లో హైదరాబాద్ నగరం జోరు కనబరుస్తోంది. భాగ్యనగరంతో పాటు బెంగళూరు, ఢిల్లీ? ఎన్‌సీఆర్, చెన్నై నగరాల్లో జీసీసీ కేంద్రాలు అధికంగా ఏర్పాటవుతున్నాయి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న జీసీసీల్లో 74 శాతం మేర ఈ నగరాలకే వస్తున్నాయని ఓ నివేదిక తెలిపింది. బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో టెక్నాలజీ నిపుణుల లభ్యత అధికంగా ఉంటుంది. టాలెంట్ హాట్‌స్పాట్లుగా ఈ రెండు నగరాలు మారుతున్నాయి.

ఈ క్రమంలో కొత్త జీసీసీ కేంద్రాలను ఈ రెండు నగరాలు ఎక్కువగా ఆకర్షించగలగుతున్నట్లు రిపోర్ట్ తెలిపింది. టెక్నికల్ నాలెడ్జ్ గల మానవ వనరుల లభ్యత అధికంగా ఉండడం, బలమైన అంకుర సంస్థల వ్యవస్థ, అందుకు ప్రభుత్వ మద్దతు.. భారత్ వైపు ఆ సంస్థలు చూసేందుకు కీలకమైన అంశాలుగా తెలుస్తోంది.

ఇన్ని సౌలభ్యాలు ఉన్నందునే బహుళ జాతి కంపెనీలు కొత్త జీసీసీలను భారత్‌లో అధికంగా స్థాపిస్తున్నాయని అంటున్నారు. జీసీసీలకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి ఇటీవల హైదరాబాద్ కేంద్రం గా నాసామ్ జీసీసీ కాన్‌క్లేవ్-2022ను సైతం నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ చాలా అనుకూలంగా ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం విశేషం. ఇతర నగరాలతో పోల్చితే ఇక్కడున్న మౌలిక సదుపాయాలు అసమానమైనవిగా పేర్కొన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం నుంచైనా, నగరంలోని ఏదైనా ప్రధాన ప్రాంతాల నుంచైనా.. ఐటీ కారిడార్‌లోని గమ్యస్థానానికి గంటలోపు చేరుకో వచ్చు. దీనికితోడు నగరంలో 69 కిలోమీటర్ల మెట్రో రైలు కనెక్టివిటీ ఉన్నది. ఫ్లై ఓవర్ల నిర్మాణాల వల్ల ట్రాఫిక్ కు పెద్దగా ఇబ్బంది లేదు. ఇవన్నీ గమనించే పెద్ద పెద్ద సంస్థలు తమ జీసీసి ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయి. ఇక భద్రతపరంగా నగరంలో సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా ఉన్నది. ఇది ఐటీ కారిడార్‌లలో కంపెనీలకు భద్రత, ప్రత్యేకంగా మహిళల రక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ కోసం పనిచేస్తున్నది. పోలీసు శాఖ-ఐటీ పరిశ్రమల మధ్య దీన్ని ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులే జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షిస్తున్నాయిఅమెరికాకు చెందిన మెక్‌డొనాల్డ్స్ సంస్థ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రం (జీసీసీ) ఏర్పాటు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పెట్టుబడుల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జీసీసీ విభాగం చైర్మన్, సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్కితోపాటు గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు స్కై ఆండర్సన్, చీఫ్ గ్లోబల్ ఇంపాక్ట్ ఆఫీసర్ జాన్ బ్యానర్, గ్లోబల్ ఇండియా హెడ్ దేశాంత కైలా ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. 2000 మంది ఉద్యోగులతో మెక్‌డొనాల్డ్స్ ఇండియా సంస్థ గ్లోబల్ ఆఫీసును నెలకొల్పనుంది. ఈ కేంద్రాన్ని తమతమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని పలు రాష్ట్రాలు పోటీపడినప్పటికీ. మెక్‌డొనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకోవటం గర్వంగా ఉందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొంటూ, ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సంస్థకు అవసరమైన శిక్షణ నైపుణ్యమున్న ఉద్యోగులను నియమించుకు నేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. వర్సిటీని స్కిల్ జోన్‌గా ఉపయోగించుకొని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్‌లోనే కాకుండా, దేశ విదేశాల్లో తమ ఆఫీసులు, అవుట్‌లెట్లలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థ హెచ్‌సిఎ హెల్త్‌కేర్.. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఒక భారీ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ ను ప్రారంభించింది. సత్వా నాలెడ్జ్ పార్క్‌లో 4,00,000 చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకున్న ఈ సంస్థ 2026 నాటికి 3,000 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ విస్తరణ హైదరాబాద్‌ను ప్రపంచ ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ జిసిసిలకు ఒక ముఖ్య కేంద్రంగా నిలబెడుతోంది. ఇప్పటికే యునైటెడ్ హెల్త్ గ్రూప్,నోవార్టిస్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తోంది. హెచ్ సి ఎ హెల్త్‌కేర్ రాకతో నగరం మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్ జీవశాస్త్ర రంగంలో తన ప్రాధాన్యతను మరింత బలపరుచుకుంటోందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. దేశంలోని తొలి హెల్త్‌కేర్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హెచ్‌సిఎ హెల్త్ కేర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే హైదరాబాద్ ఐటీ, ఫార్మా రంగాల కేంద్రంగా గుర్తింపు పొందిందని, ఇప్పుడు ఆరోగ్యరంగంలో కూడా ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంటోందని అన్నారు. హాస్పిటాలిటీ రంగంలో ప్రారంభించిన జీసీసీ తరువాత.. హెల్త్‌కేర్‌లో ఇలాంటిది మొదటిసారిగా హైదరాబాద్‌లో ఏర్పడటం గర్వకారణమని పేర్కొన్నారు.

# పడక గదిలో సీసీ కెమెరాలు..

తిరుపతి, : ఒక మనిషిని గెలవాలంటే నేరుగా తలపడాలి. యుద్ధక్షేత్రంలో ప్రత్యర్థిని ఓడించాలంటే ముందుగా మన సత్తా ఏమిటో చూపించాలి. అలాకాకుండా వెన్నుపోటు పొడిచి.. దొడ్డి దారి ప్రణాళికలు రూపొందిస్తే దానిని యుద్ధ రీతి అనరు. ఇటువంటి విధానాన్ని అమలు చేసిన ఓ రాజకీయ నాయకుడు ఇప్పుడు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. విపరీతమైన విమర్శలను చవిచూస్తున్నాడు. తట్టుకోలేక రాష్ట్రానికి దూరంగా ఉంటున్నాడు.ఆ రాజకీయ నాయకుడికి బలమైన నేపథ్యం ఉంది. ఆయన తండ్రి మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆ నాయకుడు ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు.. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలో ఉంది. ఆ నియోజకవర్గ ప్రజలు దీవించారు కాబట్టి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. మరోసారి ఆయన గెలవాలంటే గొప్ప పనులు చేయాలి. ప్రజల మనసులో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకోవాలి. అవసరమైతే తనకు శత్రుత్వం అనేది లేకుండా.. ప్రత్యర్థి అనే వ్యక్తి ఉండకుండా చూసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే ముందుగా ఆ రాజకీయ నాయకుడిలో మంచితనం ఉండాలి. కానీ ఎమ్మెల్యే గా గెలిచిన ఆ నాయకుడిలో మంచితనం అనేది లేకుండా పోయింది. ముంచేతనం అనేది పెరిగిపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా తనకు ప్రత్యర్థిగా ఉన్న ఒక మహిళపై పైశాచికత్వాన్ని ప్రదర్శించిన తీరు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా మారింది.ఆమె ఉన్నత విద్యావంతురాలు. తన నియోజకవర్గానికి సేవ చేయడానికి రాజకీయాలలోకి వచ్చారు. అంతేకాదు సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేశారు. డబ్బు కూడా భారీగా ఖర్చు పెట్టారు. ఆమె భర్త కూడా ఇందుకు సహకరించారు. అయితే ఆమెకే టికెట్ అనుకుంటున్న క్రమంలో.. ఊహించిన విధంగా పొత్తు ఏర్పడింది.. దీంతో ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పొత్తు ధర్మంలో భాగంగా భాగస్వామ్య పార్టీకి సపోర్టు ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఆమెకు ఎమ్మెల్యే యోగ్యం దక్కలేదు. సరే తమతో పొత్తు కుదుర్చుకున్న పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారని.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని ఆమె గొప్పగా చెప్పుకుంది. అంతేకాదు అధికారంలోకి తమ పార్టీ భాగస్వామిగా ఉన్న సమూహం రావడంతో ఆనందపడింది. కానీ ఇక్కడే ఆమె ఆనందం ఆవిరైంది. దానికి ప్రధాన కారణం ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే నే.ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఆ నాయకుడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి తనకు రాజకీయ శత్రుత్వం ఉండకూడదని ఆయన భావించాడు. అందువల్లే తమ సమూహంలో ఉన్న పార్టీకి సంబంధించిన నాయకురాలికి అసలు రాజకీయ జీవితంలో లేకుండా చేయాలని అనుకున్నాడు. ఆమె దగ్గర పని చేస్తున్న ఒక వ్యక్తిని దగ్గరికి తీసుకున్నాడు. డబ్బు ఆశ చూపించాడు. అయితే ఆ నాయకురాలికి మరొక వ్యక్తితో సంబంధం ఉండేది. ఇదే అదునుగా భావించిన ఆ ఎమ్మెల్యే ఆ నాయకురాలి వద్ద పనిచేస్తున్న వ్యక్తితో చేయకూడని కార్యక్రమాలు చేయించాడు. ఆ నాయకురాలు పడకగదిలో సీసీ కెమెరాలు పెట్టించాడు.. దీంతో ఆ నాయకురాలు తన ప్రియుడితో సాగించే సరసాలు అందులో రికార్డ్ అయ్యాయి. ఈ వీడియోలు మొత్తం కూడా ఆ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకు పంపించాడు. ఆ వీడియోలను అడ్డం పెట్టుకొని సదరు నాయకురాలిని బెదిరించేందుకు ఆ ఎమ్మెల్యే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. కానీ ఇంతలోనే ఆ నాయకురాలు తన వద్ద పనిచేసే వ్యక్తి వీడియోలు పంపిస్తుండగా చూసింది.. ఆ తర్వాత ఈ విషయాన్ని తన భర్తకు వేరే విధంగా చెప్పింది. దీంతో ఆమె భర్త.. తన అనుచరులతో కలిసిఓ ప్రణాళిక రూపొందించాడు. అంతేకాదు తమ వద్ద పనిచేస్తున్న ఆవ్యక్తిని అంతం చేశాడు. ఈ వ్యవహారంలో అతడు ప్రస్తుతం జైల్లో ఉంటున్నాడు. ఆవుల మంద పోట్లాడుకుంటే దూడల కాళ్ళు విరిగినట్టు.. ఎమ్మెల్యే, ఓ నాయకురాలు మధ్య ఏర్పడిన వివాదం చివరికి ఒక మనిషి ప్రాణం పోవడానికి కారణమైంది. అతని కుటుంబాన్ని దిక్కులేని వాళ్ళను చేసింది. అందుకే సాధ్యమైనంతవరకు పెద్దల వ్యవహారాలలో వేలు పెట్టకపోవడమే మంచిది.

### జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్:స్థానిక కరీంనగర్ లోని మంకమ్మతోట దగ్గర్వాడి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ఈ నెల 22 న వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు నిర్వహించడం జరిగింది. ఇట్టి పోటీలలో సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 94 కేజీల విభాగంలో ఎమ్.డి. అయాన్ 60 కేజీల విభాగంలో ఎమ్.డి. సులేమాన్ గోల్డ్ మెడల్ సాధించారు. నవంబర్లో హన్మకొండలో 7,8,9వ తేదీలలో జరగబో యే రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కరబరిచి స్వర్ణపతకాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి అభినందిస్తూ, పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకొనిరావాలని రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులనుద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి డైరెక్టర్ స్వప్న శ్రీపాల్ రెడ్డి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# పవన్ వర్సెస్ ఆర్ ఆర్ ఆర్..!



భీమవరం, : ఏపీలోఒక అంశం హాట్ టాపిక్ అవుతోంది. నిన్న రోజంతా భీమవరం డిఎస్పి జయ సూర్య వార్తల్లో నిలిచారు. ఆయన విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించడం ఈ ప్రచారానికి కారణం. కూటమినేతల పేర్లు చెప్పుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ డీఎస్పీ జయ సూర్య పై అనేక రకాల ఫిర్యాదులు వచ్చాయి. భీమవరం పరిధిలో పేకాట శిబిరాలకు అండగా నిలుస్తున్నారని.. సివిల్ కేసుల్లో తల దూర్చుతున్నారని ఆయనపై వచ్చిన ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ ని ఆదేశించారు డిప్యూటీ సీఎం. ఇదే విషయాన్ని హోం శాఖ మంత్రితో పాటు బిజెపి కార్యాలయానికి సైతం సమాచారం అందించాలని పవన్ డిప్యూటీ కార్యాలయ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అప్పటినుంచి ఇది హాట్ టాపిక్ గా మారింది. అయితే తాజాగా ఈ అంశంపై మాట్లాడారు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు.గన్నవరం డిఎస్పీగా ఉండేవారు జయసూర్య. అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయత ప్రదర్శించే వారని ఆయన పై ఆరోపణలు ఉన్నాయి. ఓ కూటమి ఎమ్మెల్యే మద్దతుతో ఆయన భీమవరం లో పోస్టింగ్ ఇప్పించుకున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఆ డీఎస్పీని ఓ కూటమి ఎమ్మెల్యే అండదండగా నిలుస్తున్నారని ఒక టాక్ అయితే ఉంది. సరిగ్గా ఇదే సమయంలో రఘురామకృష్ణంరాజు స్పందించడం గమనార్హం. మరోవైపు పవన్ కళ్యాణ్ ఫిర్యాదుతో సీఎం చంద్రబాబు సైతం ఈ విషయాన్ని సీరియస్గా తీసుకున్నారు. దీనిపై నివేదిక ఇవ్వాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తాను ఆదేశించారు. మరోవైపు హోం మంత్రిత్వ శాఖ విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం ఏమిటి అన్న ప్రశ్న వస్తోంది. ఆయన కేవలం హోదా ప్రకారమే డిప్యూటీ సీఎం కానీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలు ఫైనల్ అని.. మరి పవన్ కళ్యాణ్ ఎలా స్పందిస్తున్నారని విలేకరులు హోంమ ంత్రి వంగలపూడి అనితను ప్రశ్నించారు. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మాది ఎన్డీఏ ప్రభుత్వమని..


అంతా సమాచారం తమ వద్ద ఉందని.. శాఖల మధ్య సమన్వయం కొనసాగుతోందని చెప్పారు.తాజాగా దీనిపై స్పందించారు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు. భీమవరం డిఎస్పీకి మంచి ట్రాక్ రికార్డు ఉందన్నారు. తనకున్న సమాచారం ప్రకారం జిల్లాలో పేకాట పై ఆయన నిఘా పుట్టారని.. అందుకే ఆయనపై అభియోగాలు వస్తున్నాయని అనుకుంటున్నాట్లు తెలిపారు. తన నియోజకవర్గం నుండి పరిధిలో ఎలాంటి పేకాట స్థావరాలు లేవని.. జూదం పై కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందని తెలిపారు. తద్వారా రఘురామకృష్ణం రాజు భీమవరం డిఎస్పి కి క్లీన్ చీట్ ఇచ్చినట్లు అయింది. ఈ పరిణామం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందో చూడాలి

# ఆస్ట్రేలియాకు ఆక్వా ప్రొడక్ట్స్



విజయవాడ,: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు చెబితేనే ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. పన్నులు పెంచి ప్రపంచ దేశాలను కోలుకోలేని దెబ్బతీశారు. ఆ దేశానికి ఉత్పత్తి అయ్యే అన్ని రకాల వస్తువుల పై భారీగా సుంకం పెంచి ప్రపంచంలో చాలా దేశాలను ఇబ్బంది పెట్టారు. అందులో బాధిత దేశంగా ఇండియా ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ పెంచిన సుంకాలతో మన దేశంపై పెద్ద ప్రభావమే పడుతోంది. ముఖ్యంగా ఆక్వారంగం కష్టాల్లో పడింది. రొయ్యల ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఏపీ మంత్రి నారా లోకేష్ చతురతతో వ్యవహరించారు. అమెరికా ద్వారా జరిగిన నష్టాన్ని ఆస్ట్రేలియాతో బత్తి చేయడంలో లోకేష్ సక్సెస్ అయ్యారు. ఇది నిజంగా ఏపీలోని ఆక్వారంగానికి ఉపశమనం కలిగించే విషయమే.అగ్రరాజ్యం అమెరికాకు ఏపీ నుంచి ఆక్వా ఉత్పత్తులుఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. మొత్తం 100% ఉత్పత్తుల్లో 90 శాతం అమెరికాకే తరలిస్తుంటారు. అయితే ఆక్వాపై అమెరికాలో సుంకాలు పెంచడంతో.. ఏపీలో వాటికి సంబంధించిన ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆక్వాతో పాటు పదిరకాల అనుబంధ రంగాలపై కూడా ఇది ప్రభావం చూపింది. ఒక్కసారిగా రొయ్యల ధరలు సైతం పతనం అయ్యాయి. వాస్తవానికి మన రొయ్యలు జపాన్, చైనా తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అయితే అమెరికాకు ఎగుమతి అవుతున్న ఉత్పత్తులపై సుంకం విధించడంతో అక్కడ డోర్ క్లోజ్ చేసినట్లు అయింది. దీంతో దేశీయ మార్కెట్ రంగంపై ఏపీ ఆక్వా ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జపాన్ తో పాటు చైనాకు పరిమిత స్థాయిలోనే ఎగుమతులు అవుతున్నాయి. ఇటువంటి సమ యంలో ఆస్ట్రేలియా ఏపీ ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేందుకు ముందుకురావడం శుభ పరిణామం. దీనివెనుక మంత్రి నారా లోకేష్ కృషి ఉంది. ఆస్ట్రేలియా ఆక్వారంగా అధికారులు, ప్రతినిధులు తో సమావేశం అయినలోకేష్ వారినిఒప్పించగలిగారు. ఆస్ట్రేలియా గతం లో భారత్ నుంచి రొయ్యలను దిగుమతి చేసుకునేది. అయితే వైట్ స్పాట్ వైరస్ రొయ్యలు కావడంతోభారత్ నుంచిదిగుమతులను రద్దు చేసుకుంది. అప్పటినుంచి మన రొయ్యలపై ఆస్ట్రేలియాలో నిషేధం కొనసాగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సముద్ర ఉత్పత్తుల పరిశ్రమ ప్రతినిధులతో లోకేష్ సమావేశం అయ్యారు. ఏపీ ఆస్ట్రేలియా మధ్య ఆక్వా ఎగుమత్తుల అంశంపై వారితో చర్చించా రు. ఏపీలో ఈ రంగం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు. 2027 అక్టోబర్ 20 వరకు భారతీయ రొయ్యలను ఆస్ట్రేలియా దిగుమతి చేసుకునేందుకు అంగీకరించింది. ఈ మేరకు అక్కడి ప్రతినిధులు ఆమోదం తెలిపిన డాక్యుమెంట్లను జతచేస్తూ నారా లోకేష్ ట్వీట్ చేశారు. ఏ ఏ రకాల రొయ్యలు? ఎంత ధరకు దిగుమతి చేసుకుంటారు? అన్న వివరాలను ఆ పత్రాలలో ప్రస్తావించారు.నారా లోకేష్ ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.' భారతదేశ నుంచి ఆస్ట్రేలియాకు రొయ్యలు ఎగుమతుల్లో ఒక పెద్ద అడ్డంకి తొలిగిపోయింది. గతంలో తెల్ల మచ్చ వైరస్ ఉన్న రొయ్యలను తొక్క తీయకుండా ఆస్ట్రేలియా దిగుమతి చేసుకోలేదు. కానీ ఇప్పుడు భారత్ నుంచి వచ్చే ఆ రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా అనుమతి ఇచ్చింది. ఈ విజయం వెనుక భారత్, ఆస్ట్రేలియా ప్రభుత్వా ల కృషి ఎంతో ఉంది. వారికి నా కృతజ్ఞతలు. ఒకే మార్కెట్ పై ఆధారప డకుండా.. కొత్త మార్కెట్లను ఓపెన్ చేయడం చాలా ముఖ్యం ' అన్నారు మంత్రి నారా లోకేష్. వాస్తవానికి ఆస్ట్రేలియాతో పాటు సౌదీ అరేబియాలో మన రొయ్యలకు గిరాకీ ఉంది. అయితే తాజాగా ఆస్ట్రేలియా ప్రభుత్వం అంగీకారం తెలపడంతో సుమారు 8వేల కంటైనర్ల రొయ్యలను ఎగుమతి చేసే అవకాశం ఉంది. అమెరికాతో సమానమైన ధర లభిస్తుందని తెలుస్తోంది. మొత్తానికైతే ట్రంప్ కొట్టిన దెబ్బను ఆస్ట్రేలియాతో భర్తీ చేశారు మంత్రి నారా లోకేష్.

# దేశంలో డిజిటల్ పేమెంట్స్ హవా.. 99.7 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే




**డిజిటల్ ఇండియా**

**గత ఏడాది లావాదేవీల వివరాలను వెల్లడించిన ఆర్బీఐ**

**ఈ ఏడాది ప్రథమార్ధంలోనూ కొనసాగిన**


ముంబై,: గత ఏడాది దేశంలో జరిగిన పేమెంట్ లావాదేవీల వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. 2024లో జరిగిన చెల్లింపుల్లో 99.7 శాతం లావాదేవీలు నెఫ్ట్, ఐఎంపీఎస్, ఆర్టీజీఎస్, నాచ్, డెబిట్-క్రెడిట్ కార్డులు, యూపీఐ, ఇతర ప్రీ-పెయిడ్ పేమెంట్ సాధనాల వంటి డిజిటల్ పేమెంట్ వేదికల ద్వారానే జరిగినట్టు తెలియజేసింది. మొత్తం లావాదేవీల విలువలో వీటన్నిటి వాటా 97.5 శాతంగా ఉన్నట్టు సెంట్రల్ బ్యాంక్ వివరించింది. చెక్కుల రూపంలో జరిగిన చెల్లింపుల విలువ 2.3 శాతంగా ఉన్నట్టు పేర్కొన్నది. దీంతో నగదు లావాదేవీల విలువ కేవలం 0.2 శాతానికే పరిమితమైనట్టు తేలింది.

ఈ ఏడాదిలోనూ..: అర్ధ వార్షిక పేమెంట్ సిస్టమ్ రిపోర్ట్-జూన్ 2025 పేరిట ఆర్బీఐ విడుదల చేసిన తాజా నివేదికలో ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లోనూ డిజిటల్ పేమెంట్స్‌దే హవా కొనసాగినట్టు రుజువైంది. ఇక వీటిలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వాటానే 85 శాతం (10,637 కోట్లు)గా ఉండటం గమనార్హం. అయితే మొత్తం లావాదేవీల విలువలో వీటి వాటా 9శాతమే (రూ.143.3 లక్షల కోట్లు). గత ఏడాది ఇవి వరుసగా 17,221 కోట్లు, రూ.246.8 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2019లో రూ.18.4 లక్షల కోట్ల విలువైన 1,079 కోట్ల లావాదేవీలు జరిగాయి. కాగా, రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్టీజీఎస్) సిస్టమ్ ద్వారా జరిగిన చెల్లింపుల విలువ అత్యధికంగా 69 (రూ.1,079.2 లక్షల కోట్లు) శాతంగా ఉన్నది. అయినప్పటికీ లావాదేవీల సంఖ్య 0.1 శాతం (16.1 కోట్లు)మాత్రమే. దీంతో భారీ లావాదేవీలకు ఆర్టీజీఎస్ నే అంతా ఎంచుకుంటున్నట్టు స్పష్టమవుతున్నది. చిన్న పేమెంట్స్ అన్నీ యూపీఐ ద్వారానే ఎక్కువగా జరుగుతుండటంతో సంఖ్యాప రంగా లావాదేవీల్లో ఇవే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఆర్బీఐ వర్గాలు చెప్తున్నాయి. ఇదిలావుంటే నిరుడు లావాదేవీల్లో ఆర్టీజీఎస్‌వి 29.5 కోట్లుగా ఉన్నాయి. వీటివిలువ రూ.1,938.2 లక్షల కోట్లు. 2019లో ఇవి వరుసగా 14.8 కోట్లు, రూ.1,388.7 లక్షల కోట్లుగా ఉన్నాయి. నెఫ్ట్‌కు పెరిగిన ఆదరణ: 2019 నుంచి 2024 వరకు గమనిస్తే.. నెఫ్ట్ లావాదేవీలు సంఖ్యాపరంగా మూడింతలకుపైగా ఎగబాకాయి. 262.2 కోట్ల నుంచి 926.8 కోట్లకు చేరాయి. విలువ కూడా రూ.232.9 లక్షల కోట్ల నుంచి రూ.432.8 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఏడాది జనవరి-జూన్‌లో రూ.237 లక్షల కోట్ల విలువైన 490.5 కోట్ల లావాదేవీలు జరిగాయి. క్రెడిట్ కార్డు లావాదేవీలు నిరుడు 447.2 కోట్లుగా ఉన్నాయి. విలువ రూ.20.4 లక్షల కోట్లు. 2019లో ఇవి వరుసగా 208.7 కోట్లు, రూ.7.1 లక్షల కోట్లే. ఈ ఏడాది ప్రథమార్ధంలో రూ.11.1 లక్షల కోట్ల విలువైన 266.3 కోట్ల లావాదేవీలు జరిగాయి. గత ఏడాది చెక్కుల ద్వారా జరిగిన లావాదేవీల విలువ రూ.2,830 లక్షల కోట్లు. 20,849 కోట్ల లావాదేవీలు జరిగాయి. 2019లో రూ.1,775 లక్షల కోట్లుగా, 3,248 కోట్ల లావాదేవీలుగా ఉన్నాయి. 2025 జనవరి-జూన్‌లో చెక్కుల రూపంలో జరిగిన 12,549 కోట్ల లావాదేవీల విలువ రూ.1,572 లక్షల కోట్లు. 2019 పేమెంట్స్‌లో 96.7 శాతం లావాదేవీలు డిజిటల్ పేమెంట్సే. చెల్లింపుల విలువలో 95.5 శాతంగా ఉన్నాయి. 2024లో ఇవి వరుసగా 99.7 శాతంగా, 97.5 శాతంగా ఉన్నాయి. 2025 జనవరి-జూన్‌లో నమోదైన లావాదేవీల్లో 99.8% డిజిటల్ పేమెంట్సే. విలువలో వీటి వాటా 97.7 శాతం. 2019 నుంచి తగ్గుముఖం పడుతున్న డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదే వీలు. బ్యాంకులు, ఏటీఎంలలో నగదు ఉపసంహరణలకు మాత్రమే వినియోగం. పెరుగుతున్న క్రెడిట్ కార్డు లావాదేవీలు. ఆన్‌లైన్‌లో విశేషంగా వాడుతున్న వినియోగదారులు. క్రెడిట్ కార్డు లావాదేవీల్లో కొనసాగుతున్న ప్రైవేట్ రంగ బ్యాంకుల హవా. కో-బ్రాండెడ్ ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్న సంస్థలు. ఈ ఏడాది జూన్ నాటికి 10 లక్షల కార్డులను జారీ చేసిన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు. అందరికీ యూటీఐ తప్పనిసరి: వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఫారిన్ కరెన్సీ డెరివేటివ్‌లు, రూపీ వడ్డీరేటు కోసం ఓవర్-ది-కౌంటర్ (ఓటీసీ) మార్కెట్లలో అన్ని లావాదేవీలకు యూనిక్ ట్రాన్సాక్షన్ ఐడెంటిఫైయర్ (యూటీఐ)ను తప్పనిసరి చేయాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. ఈ మేరకు గురువారం 'యూటీఐ ఫర్ ఓటీసీ డెరివేటివ్ ట్రాన్సాక్షన్స్ ఇన్ ఇండియా'పై ఓ డ్రాఫ్ట్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. ఓటీసీ డెరివేటివ్‌లు ఫైనాన్షియల్ డెరివేటివ్ కాంట్రాక్టులు. రెగ్యులేటెడ్ ఎక్స్ఛేంజీల్లో కాకుండా రెండు పార్టీల మధ్య నేరుగా ట్రేడ్ అవుతాయి. మరోవైపు నూతన సాంకేతిక పరిష్కారాల కోసం ఆర్బీఐ ఓ గ్లోబల్ హ్యాకథాన్‌ను ప్రారంభించింది.

## పైకప్పుపైనా క్యాలీఫ్లవర్



ఇంటి పెరటిలో గానీ, టెర్రస్ పైనగానీ, అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో గానీ పెంచుకోవడానికి క్యాలీఫ్లవర్ అనువుగా ఉంటుంది. అనేక పోషకాలతో నిండిన ఈ కాయగూరను ఏడాదంతా తినొచ్చు. విటమిన్ సి, కెతోపాటు పొటాషియం, మాంగనీస్, ప్రొటీన్‌లు అధికంగా లభించే క్యాలీఫ్లవర్.. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. హృదయ సంబంధిత వ్యాధులు, వివిధ రకాల క్యాన్సర్ల ప్రభావాన్నీ తగ్గిస్తుంది. ఇలాంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందించే క్యాలీఫ్లవర్‌ను ఇంటివద్దే సులభంగా పెంచేయొచ్చు. సెప్టెంబర్ -అక్టోబర్ మధ్యలో విత్తనాలు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. కాబట్టి, మార్కెట్లో అందుబాటులో ఉన్న క్యాలీఫ్లవర్ విత్తనాలు, మొక్కలు తెచ్చి నాటుకుంటే సరిపోతుంది. మొక్కను నాటిన 55 నుంచి 60 రోజుల్లోనే క్యాలీఫ్లవర్ తయారవుతుంది. అయితే, క్యాలీఫ్లవర్ పెరిగేందుకు సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉండే మట్టి అవసరం. 6.0 నుంచి7.0 మధ్య పీహెచ్ పరిధిలో ఈ మొక్క బాగా పెరుగుతుంది. క్యాలీఫ్లవర్ పువ్వు తెల్లగా, మచ్చలు లేకుండా ఉండాలంటే.. పెరుగుతున్న పువ్వులోకి సూర్యరశ్మి చేరకుండా జాగ్రత్త పడాలి. ఇందుకోసం పువ్వు చుట్టూ ఉండే ఆకులలో చివరి వరుస ఆకులను రబ్బరు బ్యాండ్‌తో కట్టాలి. పువ్వు సరైన పరిమాణంలో పెరిగిన తర్వాత కోసుకోవాలి.



## విశాఖలో కంటైనర్ మెగా పోర్టు

### – రాష్ట్రానికి నీతిఆయోగ్ సూచన

అమరావతి : విశాఖపట్నంలో కంటైనర్ మెగా పోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తో నీతిఅయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ మేరకు సూచించిచారు. తూర్పుతీరంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందున్నట్లు ఆయన చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న పూర్వోదయ పథకం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించిన ఆయన అందులో భాగంగానే విశాఖ గ్రోత్ హబ్ పైనా చర్చించారు. ఈ పథకం ద్వారా తీర ప్రాంతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆస్కారం ఉందన్నారు. రాష్ట్రంలో అనేక ఓడరేవులు ఉన్నప్పటికీ వాటికి అదనంగా కంటైనర్ మెగా పోర్టును ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. త్వరలో జరగనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో సమగ్రాభివృద్ధిపై చర్చ ఉంటుందని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఇందుకోసం వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా నివేదికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో విశాఖ, అమరావతి, తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు, దానివల్ల కలిగే ప్రయోజనాల పైనా సమీక్షించారు. సిఎస్ విజయానంద్ మాట్లాడు తూ విశాఖ గ్రోత్ హబ్ పనుల వేగవంతానికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన నిధులు వచ్చేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సుబ్రహ్మణ్యంను కోరారు. తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రా, ఒడిషా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో అభివృద్ధికోసం పూర్వోదయ పథకాన్ని ఏర్పాటు చేశారు. సాంస్కృతిక వారసత్వం, సహజ వనరుల ను ఉపయోగించుకోవడంద్వారా మౌలిక వసతుల ను సృష్టించుకోవడం, ఉపాధి అవకాశాలను పెంచు కోవడం, స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించడం ఈ పథకం లక్ష్యాలు, మౌలికాభివృద్ధిలో భాగంగా రహదారులు, వంతెనల నిర్మాణం, విమానాశ్రయాలు, ఓడరేవులు,విద్యుత్ ప్లాంట్లు వంటివి ఏర్పాటుచేస్తారు.. ఈభేటీలో నీతి ఆయోగ్ అదనపు సిఇఓ పార్థసారథిరెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్కుమార్, విద్యాశాఖ కార్యదర్శి శశిధర్, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్చంద్, ప్రణాళికశాఖ సంయుక్త కార్యదర్శి అనంత్ శంకర్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండి గణేష్కుమార్ పాల్గొన్నారు.

# సిగ్గుల మొగ్గ కావొద్దంటే!?



ఇంటికి కొత్తగా వచ్చిన బంధువులతో కొందరు పిల్లలు సరిగ్గా కలవలేరు. సిగ్గు పడుతూ.. బిడియంతో ముడుచుకు పోతారు. ఇంటి కొచ్చిన అతిథుల విషయంలోనే కాదు.. క్లాస్‌లో తోటి విద్యార్థులతోనూ సరిగ్గా కలవలేరు.దాంతో, వారి ఫ్రెండ్స్ లిస్ట్‌లో కొద్దిమందే ఉంటారు. అయితే, ఇలాంటి సమస్యను బాల్యంలోనే గుర్తించి.. వారిలో మార్పు తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. లేకుంటే, పెద్దయ్యాక అంతర్ముఖులుగా తయారయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నా రు. అంతేకాదు..ఈ అలవాటుదీర్ఘకాలం లోవారిలో నమ్మకం, సామాజి క సంబంధాలపై ప్రభావం చూపుతుందనీ చెబుతున్నారు. పిల్లల్లో సిగ్గూ, బిడియం తగ్గాలంటే.. కొన్ని సలహాలు, సూచనలు పాటించా లని సూచిస్తున్నారు. పిల్లలు ఎక్కువగా సిగ్గు పడుతున్నారం టే.. ఇందుకు జన్యుపరమైన కారణాలు, గత అనుభవాలు, వ్యక్తిత్వ లక్షణా లు కారణం కావచ్చు. కాబట్టి, ముందుగా మీ పిల్లల సమస్య ఏమిటో గుర్తించండి. వేర్వేరు పరిస్థితుల్లో వారి ప్రవర్తనను గమనించండి. జన్యుపరమైన కారణాలైతే.. వైద్య నిపుణులను సంప్రదించాలి. ఇక గత అనుభవాలు, వ్యక్తిత్వ లక్షణాలతో సిగ్గుపడుతుంటే.. వారికి తగిన సూచనలు ఇవ్వండి. ఎట్టిపరిస్థితుల్లోనూ పిల్లవాడిపై 'సిగ్గరి' అనే ముద్రను వేయకండి. ఇది వారి మానసిక అభివృద్ధిని అడ్డుకుంటుంది. వారిలో నమ్మకాన్ని తగ్గిస్తుంది. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచండి. తమపై తమకు నమ్మకం ఉన్న పిల్లలు.. సిగ్గుపడే అవకాశం తక్కువగా ఉంటుంది. మీ పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి.. దాన్ని ప్రోత్స హించండి. ఆటలు, చిత్రకళ, గానం.. ఇలా వారికి ఆసక్తి, సామర్థ్యం ఉన్న రంగంలో పిల్లలకు మద్దతుగా నిలవండి. తాను ప్రతిభావంతుడు, సమర్థుడినని తెలుసుకున్న పిల్లలు.. సామాజికంగా మరింత ధైర్యంగా వ్యవహరిస్తారు. పిల్లల చుట్టూ ఉండే వాతావరణం ఎప్పుడూ వారికి సురక్షితంగా అనిపించాలి. అప్పుడే, వారు ఇతరులతో కనెక్ట్ కావడానికి ఆసక్తి చూపుతారు. వాతావరణం తమకు నచ్చినట్లుగా ఉంటే.. పిల్లల్లో ఆందోళన తగ్గుతుంది. వారిలో నమ్మకాన్నీ పెంచుతుంది.

దాంతో, బిడియం తగ్గుతుంది. పిల్లలు ఇతరులతో కలిసేలా, వారితో మాట్లాడేలా ప్రోత్సహించాలి. ఇతరులతో స్నేహంగా మెలిగినప్పుడు.. పిల్లల్లో సిగ్గు, బిడియం తగ్గుతుంది. వారిలో సామాజిక నైపుణ్యాలు, నమ్మకాన్ని పెంచడానికి సహాయపడుతుంది. ఇక పిల్లలకు తప్పకుండా నేర్పించాల్సిన మరో సామాజిక నైపుణ్యం.. ఇతరులను పలకరించడం. ఇందుకు వారి మిత్రులే అవ్వాల్సిన అవసరం లేదు.

మీ స్నేహితులు, బంధువులు ఎదురుపడినా.. విష్ చేసేలా పిల్లల్ని ప్రోత్సహించాలి. పిల్లలు స్వతంత్రంగా విజయాలు సాధించడం మంచిదే! అదే సమయంలో.. సామాజికంగానూ, బృందంగానూ విజయం సాధించేలా వారికి అవకాశాలను కల్పించండి. నలుగురితో కలిసి ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి.

## ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

హైదరాబాద్, : హైదరాబాద్ శివారులోని పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి దూలపల్లి పారిశ్రామిక వాడలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. క్రౌన్ పాలిమర్ పరిశ్రమలో షాట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలం చేరుకొని మంటలను10 గంటలు శ్రమించి 5 ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. సరియైన ఫైర్ సేఫ్టీ లేకపోవడమే? ఇంతటి పెద్ద అగ్ని ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 5 ఫైర్ ఇంజిన్లు, ఒక రోబో మిషన్, 2 అంతస్తులకు ఫైర్ అంటుకోవడంతో మంటలు ఆర్పేందుకు ఫైర్ సిబ్బందితో పాటు డిఆర్ఎఫ్ సిబ్బంది, పేట్ బషీరా బాద్ పోలీస్ స్టేషన్ సహకారంతో మంటలు ఆదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. క్రౌన్ పాలిమర్ పరిశ్రమకు సరైన ఫైర్ సేఫ్టీ లేకపోవడమే ఈ అగ్ని ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన బిల్డింగ్ స్టీల్ ప్లేస్ త్రీ ఫ్లోర్స్ ఉండడం పైప్ లైన్‌తో ఉండాల్సిన ఫైర్ సేఫ్టీ నామమాత్రపు అనుమతులతో ఈ పరిశ్రమ నడుస్తున్నట్టు సమాచారం. జీడిమెట్ల పారిశ్రామిక వాడ మరియు దూలపల్లి పారిశ్రామికవాడలో అనేక కంపెనీలలో కంపెనీకి తగ్గట్టుగా సరియైన ఫైర్ సేఫ్టీ లేకపోవడం ఇలాంటి భారీ అగ్ని ప్రమాదాలకు దారితీస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తారని ఫైర్ అధికారులపై ఫైర్ అవుతున్నారు. తర్వాత వెళ్లిపోతారని పట్టించుకోరని అంటున్నారు. కొన్ని కంపెనీలకు ఫైర్ ఎన్ఓసీలు లేకుండా కూడా నడిపిస్తున్నారు. అగ్నిప్రమాదాలకు సంబంధించిన ఘటనలు అనేకంగా జరిగిన అటు అధికారులు కావచ్చు ఇటుకంపెనీ యాజమాన్యాలుకావచ్చు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ అగ్ని ప్రమాదాలకు కారణమని స్థానికులు తెలిపారు. ఒక కంపెనీ ప్రారంభిస్తున్నారు అని అంటే కంపెనీకి సంబంధించిన ఎన్వోసీలు ప్రతి డిపార్ట్మెంట్ నుంచి ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ వచ్చి పరిశీలించాలి. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు సరిగ్గా చేయకపోవడమే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అ?తున్నాయని స్థానికులు తెలిపారు.

# అందానికి ఆలుగడ్డ!

శీతాకాలం మొదలైంది. చల్లని వాతావరణంలో చర్మం కళావిహీనమవుతుంది. చలి గాలులతో చర్మం నిర్జీవంగా మారి.. ముఖం పాలిపోయినట్లు కనిపిస్తుంది. దీని నుంచి తప్పించుకోవడానికి రకరకాల క్రీములు, లోషన్లు వాడాల్సిన అవసరం లేదు. కేవలం వంటింట్లో దొరికే ఆలుగడ్డలతో.. చలిబారి నుంచి అందాన్ని కాపాడుకోవచ్చు.చర్మాన్ని కాంతివంతం చేసే గుణాలు ఆలుగడ్డలో పుష్కలం. ముఖంపై మొటిమలు, మచ్చలను తొలగించడంలో ఇది సమర్థంగా పనిచేస్తుంది. బంగాళాదుంప నుండి రసాన్ని తీసి.. ముఖానికి బాగా పట్టించాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా రోజూ రెగ్యులర్‌గా చేస్తుంటే.. ముఖంపై మొటిమలు, మచ్చలు పోతాయి.ఆలుగడ్డల్లో ఉండే ఎంజైమ్‌లు, విటమిన్లు సూర్యరశ్మి వల్ల దెబ్బతిన్న చర్మాన్ని బాగుచేయడంలో ముందుంటాయి. ఇవి చర్మం లోపలి నుండి పోషణను అందిస్తాయి. వాపు, నొప్పి వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఆలుగడ్డను సన్నగా, గుండ్రంగా కట్‌చేసి.. సమస్య ఉన్న ప్రాంతంలో అప్లయి చేయాలి. అరగంట తర్వాత చల్లటి నీటితో కడిగేస్తే సరి. ఆలుగడ్డలను మిక్సీలో వేసి మెత్తని పేస్టుగా చేసుకోవాలి. ఆ పేస్టుని ముఖానికి రాసుకుని అరగంట తర్వాత కడిగేస్తే.. చర్మం మృదువుగా మారుతుంది. చర్మంపై జిడ్డును తొలగిస్తుంది. ఆలుగడ్డల రసానికి నిమ్మరసం, తేనె కలిపినా మంచి ఫలితం కనిపిస్తుంది. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, పావుగంట తర్వాత కడిగేస్తే.. ముఖ ఛాయ



మెరుగుపడుతుంది.నిద్రలేమి, ఇతర సమస్యలతో కళ్ల చుట్టూ నల్లటి వలయాలు ఏర్పడతాయి. ఆలుగడ్డ రసంలో మెత్తని దూదిని ముంచి.. దానిని కళ్లపైన పెట్టి, పావుగంట అలాగే ఉంచాలి. లేకుంటే, ఆలుగడ్డను సన్నని ముక్కలు (చిప్స్ మాదిరి)గా కోసి.. వాటిని కళ్లపైన ఉంచాలి. ఈ చిట్కాను రెగ్యులర్‌గా ఫాలో అయితే, మంచి ఫలితం కనిపిస్తుంది. ఆలుగడ్డ నీటితో ముఖాన్ని కడుక్కుంటే.. ముడతలు తగ్గుముఖం పడతాయి. ముఖంపై తెల్లటి మచ్చలు తొలగించడంతోపాటు ఎండకు కమిలిపోయిన చర్మాన్ని మళ్లీ మామూలు స్థితికి తీసుకొస్తుంది.

# సబీనా సిస్టర్.. కంగ్రాట్యులేషన్స్!

ప్రతిభకి వయసు అడ్డంకి కాదని ఎంతోమంది నిరూపించారు. అయితే కేరళకి చెందిన సిస్టర్ సబీనా సాధించిన ఘనత మాత్రం అందుకు భిన్నమైనది. అక్టోబరు 22న కేరళ రాష్ట్ర 'మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్' నిర్వహించారు. అందులో 55 ప్లస్ కేటగిరీలో హర్డిల్స్ పోటీ నిర్వహించారు. ఆ పోటీలో 57 ఏళ్ల సబీనా కూడా ఉన్నారు. పోటీ ప్రారంభమైంది. కాళ్లకి చెప్పులు లేకుండా, సాంప్రదాయ దుస్తులు ధరించిన సిస్టర్ సబీనా ఎంతో వేగంగా హర్డిల్స్‌ని దాటుకుంటూ గమ్యాన్ని చేరారు. పోటీలో ప్రథమంగా నిలిచారు. బంగారు పతకం సాధించిన సబీనా ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పిఇటిగా త్వరలో రిటైర్ అవుతున్న ఆమె సాధించిన ఈ ప్రతిభ అటు విద్యార్థులని, ఇటు సాధారణ ప్రజలని కూడా ప్రభావితం చేస్తోంది.

కాసర్‌గడ్ జిల్లా ఎన్మప్ర గ్రామం సబీనా సొంత ఊరు. వయనాడ్ ద్వారకాలో అప్పర్ ప్రైమరీ స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా 1993 నుండి విధులు నిర్వహిస్తున్నారు. బాల్యం నుండీ సబీనాకి ఆటలంటే ఆసక్తి. 9వ తరగతి నుండి క్రీడల్లో రాణించిన ఆమె, కాలేజీ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొన్నారు. జాతీయస్థాయిలో హర్డిల్స్ ఆడిన అనుభవం ఆమెది. అయితే ఆ తరువాత బోధనపై




దృష్టి పెట్టి క్రీడలని దూరంపెట్టారు. ఇది నా చివరి ఆట..: తాజాగా సాధించిన ఘనత గురించి సబీనా ఇలాచెబుతున్నారు 'ఇది నా చివరి ఆట. వచ్చేమార్చిలో నేను రిటైర్ అవుతున్నాను. రిటైర్ అయ్యేలోపు ఒక్కసారైనా పోటీలో పాల్గొనాలని అనుకున్నాను. అందుకే ఈ 'స్పోర్ట్స్ మీట్'కి వచ్చాను' అని అన్నారు. సబీనా పోటీలో గెలిచినప్పుడు 'సబీనా సిస్టర్ కంగ్రాట్యులేషన్స్' అంటూ ప్రేక్షకులు అభినందనలతో ఆమెని చుట్టుముట్టారు. సబీనా విజయం కేవలం పోటీలో పాల్గొనడం వరకే పరిమితం కాదు. వ్యక్తిలో దాగున్న సామర్థ్యాన్ని వెలికితీయడానికి వయసు, ఆచారాలు అడ్డంకి కాదని మరోసారి రుజువైంది.

# ఏపీలో ఆల్ ఇన్ వన్ యాప్

ఒంగోలు: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా బిల్లు చెల్లింపులు, కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవడం సులభం కానుంది. అంతేకాకుండా.. ఇంట్లో ఉండే ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఎంత కరెంటు ఉపయోగిస్తున్నాయో ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులతో నేరుగా సంప్రదించే అవకాశం ఈ యాప్ ద్వారా కల్పించారు. కాగా ఇటీవల, విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ అధికారులను హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త సాంకేతికతను ఉపయోగిస్తోంది. వినియోగదారుల సమస్యలను మరింత వేగంగా, సమర్థంగా పరిష్కరించడానికి ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో ప్రత్యేక ఫీచర్లు అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో.. ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలిస్తారు. అనంతరం వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తారు యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు సులభంగా చెల్లించొచ్చు. బిల్‌పే అనే ఆప్షన్ ద్వారా సర్వీసు నంబరు, మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే.. వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు ప్రత్యక్షమవు తాయి. అనంతరం పేమెంట్ చేయాల్సి ఉంటుంది. ఇక కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం అప్లికేషన్ కూడా చేసుకోవచ్చు. అందుకోసం అన్ని వివరాలను యాప్‌లో పొందుప రచాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును అధికారులు పరిశీలించి కొత్త కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు. కాగా, ఇంట్లో ఏయే ఎలక్ట్రానిక్ పరికరాలు ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నాయో.. ఈ యాప్‌లో ఉన్న ఎనర్జీ కాలిక్యులేటర్ ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు మీటరు రీడింగ్ వివరాలు ఎంటర్ చేస్తే.. ఆ సమాచారం కనిపిస్తుంది. అంతేకాకుండా, కరెంట్ ఆదా చేయడానికి కూడా ఈ యాప్‌లో సలహాలు, సూచనలు ఉంటాయి. విద్యుత్ అధికారుతో కూడా నేరుగా మాట్లాడి సమస్యలు తెలిపే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది. సూపర్ యాప్ ద్వారా కస్టమర్ సేవలు కూడా అందిస్తోంది ఏపీఎస్పీడీసీఎల్. వినియోగదారులు తమ సమస్యలనుఈ యాప్‌లో పొందుపరచొచ్చు. విద్యుత్తు శాఖ అంది స్తున్న సేవలపై ఫీడ్‌బ్యాక్ కూడా ఇవ్వొచ్చు. సంతృప్తి లేదా అసంతృప్తి తెలియజే యొచ్చు.




## ఖరీదైన ఖర్చు తగ్గింపు..

# ఉద్యోగుల తొలగింపునకు ఐటీ కంపెనీల భారీ ఖర్చు!

న్యూఢిల్లీ: ప్రపంచ ఐటీ దిగ్గజాలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడానికి లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. భారీ సెవెరెన్స్ ప్యాకేజీల నుంచి అవుట్ ప్లేస్‌మెంట్ సపోర్ట్ వరకు ఉద్యోగుల తొలగింపు చర్యలు కార్పొరేట్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన 'ఖర్చు తగ్గింపు' ప్రక్రియలుగా మారాయి. అయితే, ఈ చర్య వెనుక ఒక పద్ధతి ఉందని, దీనికి బ్రాండ్ రక్షణ, పెట్టుబడిదారుల విశ్వాసం వంటి ఆర్థికాంశాలు ముడిపడి ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వారి అభిప్రాయం ప్రకారం కంపెనీలు దీర్ఘకాలికంగా ఖర్చులను కొనసాగించే బదులు, ప్రస్తుతం ఒకేసారి ఆర్థిక భారాన్ని స్వీకరించడానికి మొగ్గు చూపుతున్నాయి. 'ఎంబ్రేస్ కన్సల్టింగ్' వ్యవస్థాపకురాలు శ్రుతి స్వరూప్ ఈ వ్యూహాన్ని వివరించారు. సెవెరెన్స్ అనేది చిన్నదే అయినా, అది న్యాయపరమైన సమస్యలను నివారిస్తుంది, ఎంప్లాయర్ బ్రాండ్‌ను కాపాడుతుంది, ఉద్యోగుల బదిలీని వేగవంతం చేస్తుంది అని ఆమె తెలిపారు. అలాగే, ప్రస్తుత ఖర్చులను భరించడం ద్వారా భవిష్యత్తులో జీతాల భారం తగ్గి, సమర్థవంతమైన వ్యయ నిర్మాణాన్ని సాధించవచ్చు. ఇది కంపెనీలకు దీర్ఘకాలికంగా ప్రయోజనకరం. ఈ ఉదారతకు కారణం కేవలం దయ కాదు, రిస్క్ మేనేజ్‌మెంట్ అని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా టెక్ రంగంలో ప్రతిష్ఠ చాలా కీలకం కాబట్టి, ప్రతికూల ప్రచారం, బ్రాండ్ డ్యామేజ్‌ను తగ్గించుకోవడానికి కంపెనీలు భారీ ఎగ్జిట్ ప్యాకేజీలను అందిస్తున్నాయి.

ఏఐ యుగంలో 'వ్యూహాత్మక పెట్టుబడి': తొలగింపుల తాజా వేగం కేవలం ఖర్చులను తగ్గించుకోవడం కోసం మాత్రమే కాదని, ఏఐ(కృత్రిమ మేధస్సు)ని లోతుగా అనుసంధానించడం ద్వారా శ్రామికశక్తిని క్రమబద్ధీకరించడం దీని వెనుక ముఖ్య ఉద్దేశం అని గ్రేట్‌లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విభవ్‌సింగ్ పేర్కొన్నారు. ఏఐ ద్వారా చేపట్టే పనుల నుంచి ఉద్యోగులను తొలగించి, ఇతర విభాగాల్లో పెట్టుబడి పెట్టడానికి ఈ సెవెరెన్స్ ప్యాకేజీలు పరివర్తన వ్యయంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఇటువంటి బైఅవుట్లు మార్కెట్‌ను భయపెట్టకుండా, టాలెంట్ బేస్‌ను పునర్నిర్మించడానికి, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని నిలబెట్టడానికి సహాయపడతాయి.

భారత ఐటీలోనూ ఇదే ట్రెండ్: ఈ ధోరణి ఇప్పుడు భారతదేశంలోని ఐటీ సేవల రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఇటీవలే ఏఐ ఆధారిత పునర్నిర్మాణంలో భాగంగా 20,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్టు నివేదించింది. దీనికి సెవెరెన్స్, సంబంధిత ఖర్చుల కోసం సుమారు రూ.1,135 కోట్ల తాత్కాలిక ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేసింది. ఇందులో 3 నెలల నోటీస్ పే, 6 నెలల నుంచి 2 సంవత్సరాల జీతం వరకు సెవెరెన్స్ ప్యాకేజీలు ఉన్నాయి. యాక్సెంచర్ గత మూడేళ్లలో సెవెరెన్స్ కోసం 2 బిలియన్లకు పైగా ఖర్చు చేసింది. ఆటోమేషన్-హెవీ డెలివరీ మోడల్స్‌కు మారడంలో ఇది ఒక నిర్మాణపరమైన చర్యగా కంపెనీ అభివర్ణించింది. ఉద్యోగుల తొలగింపు సమయంలో వారికి మర్యాదపూర్వకమైన, సరసమైన ప్యాకేజీలను అందించడం ద్వారా, కంపెనీలు కొత్త ఉద్యోగులను ఆకర్షించడానికి, క్లయింట్ నమ్మకాన్ని కాపాడుకోవడానికి అవసరమైన తమ ఎంప్లాయర్ బ్రాండింగ్‌ను రక్షించుకుంటాయి. ఈబిలియన్ డాలర్ల సెవెరెన్స్ బిల్లులు దయతో కూడిన చర్యలు కాదని, ఇవి వ్యూహాత్మక పెట్టుబడులు అని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# వర్క్ పర్మిట్ ఆటోమేటిక్ పొడిగింపు రద్దు చేసిన అమెరికా




వాషింగ్టన్: హెచ్1బి వీసా ఫీజును భారీగా పెంచిన కొన్ని వారా ల్లోనే.. అమెరికా విదేశీ వలసదారులపై మరో కఠినమైన నిర్ణయం తీసుకుంది. విదేశీయులకు అవసరమైన ఉపాధి అధికార పత్రాలు- వర్క్ పర్మిట్లు (ఇఎడి)ఆటోమేటిక్ పొడిగింపును రద్దు చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇదిపెద్ద సంఖ్యలో ఉన్న భారతీయ వలసదారులు మరియు కార్మికులపై తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. వలసలను అరికట్టే తాజా ప్రయత్నాలలో భాగంగా ..వారి ఉపాధి అధికారాలు లేదా వర్క్ పర్మిట్లు అనుమతుల చెల్లు బాటును పొడిగించే ముందు "ఏలియన్స్ (విదేశీయులు) సరిగా పరీక్షించడం మరియు తనిఖీ చేయడం" ప్రాధాన్యతగా తీసుకున్నట్లు యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీస్ (డిహెచ్ఎస్) బుధవారం ప్రకటన విడుదల చేసింది. తాజా నిబంధనల ప్రకారం.. 2025ఆ తర్వాత తమ ఇఎడిని పునరుద్ధరించడాని కి దాఖలు చేసే విదేశీయులకు ఇకపై ఆటోమేటిక్ పొడిగింపు లభించదని డిహెచ్ఎస్ ఆప్రకటనలో తెలిపింది. ఒక ఏలియన్ ఉద్యోగ అధికారం లేదా డాక్యుమెంటేషన్ పొడిగించబడే ముందు తగిన పరిశీలన మరియు స్క్రీనింగ్ పూర్తయిందని నిర్ధారించుకోవడం సాధారణ చర్య. అయితే అమెరికాలో పనిచేయడం అనేది ఒక హక్కుకాదు, ఒక అవకాశం అని ఏలియన్స్ గుర్తుంచుకోవాలని యుఎస్‌సిఐఎస్ డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో తెలిపారు. దీంతో అమెరికాలో పనిచేయడానికి ఉపాధి అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే విదేశీయులను తరచుగా తనిఖీ చేయాల్సి వుంటుంది. ఈ నిర్ణయంతో హెచ్1బి,ఎల్, ఇ వీసాదారుల భాగస్వామ్యులు, శరణార్థి లేదా శరణార్థి హోదా కలిగిన విదేశీయులపై తీవ్ర ప్రభావం పడనుంది. తాజా నిబంధనల ప్రకారం.. వర్క్‌పర్మిట్ల గడువు ముగియడానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తులు సమర్పించాలని డిహెచ్ఎస్ విదేశీయు లకు సూచించింది.

ఆ తర్వాతనుంచి వర్క్ పర్మిట్లను పునరుద్ధరించేందుకు దరఖాస్తు చేసుకునే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ ఉండదని తెలిపింది. అయి తే ఈ తేదీ కంటే ముందు వర్క్ పర్మిట్లను పొండిగించుకున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదని డిహెచ్ఎస్ ప్రకటించింది. బైడెన్ ప్రభుత్వ హయాంలోపాత నిబంధనల ప్రకారం వర్క్ పర్మిట్లను పునరుద్ధరించ డానికి సకాలంలో ఫారమ్ 1-765ని దాఖలు చేసే విదేశీయులు 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు ను పొందేవారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు వాచ్1బి వీసాల ఫీజును పెంచుతూ ఒక ప్రకటనపై సంతకం చేసిన సంగతి తెలిసిందే. అమెరికా సెన్సస్ డేటా ప్రకారం.. అమెరికాలో సుమారు 4.8మిలియన్ల (48లక్షల మంది) భారతీయ అమెరికన్లు నివసిస్తున్నారు. ఇందులో 66శాతం మంది భారతీయ అమెరికన్లు వలసదారులు కాగా, 34 శాతం మంది అమెరికాలో జన్మించిన వారు.

# ఏపీలో కొత్త పొత్తులు

విజయవాడ, : ఏపీలో కమ్యూనిస్టులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కడతారా? అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? రెండువైపుల నుంచి చర్చలు మొదలయ్యాయా? రెండు వైపులా ఇది ఆవశ్యమా? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎన్డీఏలో తెలుగుదేశంతో పాటు జనసేన భాగస్వామ్య పక్షాలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి ఉంది. వైసిపి ఒంటరి పోరాటం చేస్తోంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమి లో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో తటస్థ వైఖరి అనుసరిస్తోంది. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి బిజెపి విషయంలో సానుకూలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరాటం కంటే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడమే మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం జగన్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన అసలు పేరు మధుసూదన్ రెడ్డి గా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి బంధువు అవుతారని కూడా ప్రచారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్న సమయంలో మధు అనారోగ్యానికి గురైతే పరామర్శించారు. అటు తరువాత సిపిఎం అనుబంధ పత్రికకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారీగా ప్రకటనలు కూడా వచ్చాయి. దీంతో గత పదేళ్లుగా జగన్ విషయంలో సిపిఎం పెద్దగా సౌండ్ చేయలేదు. కానీ సిపిఐ మాత్రం గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా గట్టిగానే స్టేట్మెంట్లు ఇచ్చిందిమారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జగన్ పొత్తుల విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒంటరి పోరాటం చేయడం సాహసమే. అందుకే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడం మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య ఎంపికయ్యారు. దీని వెనుక పొత్తు స్నేహం ఉన్నట్టు ప్రచారం సాగు తోంది. అయితే బిజెపికి జగన్ సానుకూలంగా ఉంటారు. ఇండియా కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. అలాగే చంద్రబాబు పట్ల వామపక్షాలకు ఆ స్థాయిలో వ్యతిరేకతలేదు. కానీ ఇప్పుడు ఏపీలో రాజకీయ ఉనికి చాటుకోక తప్పదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ కంటే ఏపీలో వైసీపీ బలంగా ఉంది. అందుకే ఆ పార్టీతో స్నేహం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి వామపక్షాలు. ఇప్పటివరకు ఒంటరి పోరాటం అన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నినాదం. దమ్ముంటే ఒంటరిగా పోటీకి రండి అంటూ టిడిపి తో పాటు జనసేనకు సవాల్ విసురుతూ వస్తోంది వైసిపి. 2014, 2019 ఎన్నికల్లో ఇదే వామపక్షాలు ఉన్న జగన్ పట్టించు కోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వామపక్షాల ఉద్యమాన్ని అణచివేశారు జగన్. అడుగడుగునా వారిని అవమానించారు. అటువంటి వామపక్షాలు ఇప్పుడు జగన్తో జతకలుస్తాయి అన్నది అనుమానమే. అయితే ఇప్పుడు పొత్తు ఇరువర్గాలకు అనివార్యం. ఆపై కూటమి ప్రభుత్వం బలంగా ఉంది. అందుకే ఇప్పుడు ఆ రెండు పక్షాలు కలుస్తాయని ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# సొంత జిల్లాపై ఫుల్ ఫోకస్..!

తిరుపతి, : మ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయాయి. అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా, స్థానిక నాయకత్వం కొరవడడం, ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం పార్టీ క్యాడర్‌ను కలవరానికి గురిచేస్తోంది. తంబళ్లపల్లి, తిరుపతి, సత్యవేడు, పుంగనూరు? ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఇన్‌ఛార్జ్‌ల పనితీరుపై క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉందట. అధికారం ఉన్నా తమను తాము రక్షించుకోలేని స్థితిలో ఉన్నామంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు అధినేత చంద్రబాబు ఏ మేరకు కఠిన నిర్ణయాలు తీసుకుంటారనే దానిపైనే ఉమ్మడి చిత్తూరు భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఇన్‌ఛార్జ్‌ల నియామకం, పనితీరపై అసంతృప్తి:. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో తీవ్రమైన నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇన్‌ఛార్జ్‌ల నియామకం, వారి పనితీరుపై పార్టీ క్యాడర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నదట. నాలుగు కీలక నియోజకవర్గాల్లో పరిస్థితి 'చుక్కాని లేని నావ' వలె మారిందట. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం, ఇతర పార్టీల నుంచి అరువు తెచ్చుకున్న నేతలకు కీలక పదవులు ఇవ్వడం, వారు లోకల్ నాయకులను విస్మరించి, తమ సొంత కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడమేనని క్యాడర్ ఆరోపిస్తోంది. శంకర్ యాదవ్, దొరస్వామి నాయుడు ప్రయత్నాలు:. తంబళ్లపల్లి నియోజకవర్గంలో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరి టికెట్ పొందిన జయచంద్రారెడ్డి ఇటీవలే నకిలీ మద్యం వ్యవహారంలో చిక్కుకోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆయన పార్టీలో చేరిన సమయంలోనే స్థానిక క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకించినా, కడప జిల్లాకు చెందిన కొందరు నేతల సహకారంతో టికెట్ సంపాదించారట. గత 16 నెలలుగా ఆయన పార్టీ శ్రేణులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ నియామకం కంటే, సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానిక క్యాడర్ పట్టుబడుతోందట. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి తిరిగి వస్తారని ప్రచారం జరుగుతున్నా, గతంలో ఆయన చంద్రబాబుపై చేసిన విమర్శల కారణంగా టీడీపీ కార్యకర్తలు అంతగా ఇంట్రెస్ట్ చూపట్లేదట. మరోవైపు, శంకర్ యాదవ్, తెలుగు యువత నాయకుడు కట్టా దొరస్వామి నాయుడు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తుండగా, క్యాడర్ మాత్రం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని కోరుకుంటోందట. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్:. తిరుపతి నియోజకవర్గంలో కూడా ఇదే విధమైన నాయకత్వ శూన్యత నెలకొని ఉందట. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నప్పటికీ, ఆమెకు సహకరించే నాయకత్వం లేకపోవడంతో ఆమె ప్రయత్నాలు ఫలించడం లేదు. చాలామంది నాయకులు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నించి, ఆశలు వదులుకుని సైలెంట్ అయ్యారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ఉండటం, అధిక సంఖ్యలో వైసీపీ నుంచి వచ్చిన కార్పొరేటర్లు జనసేన వైపు మొగ్గు చూపడం పార్టీని బలహీనపరుస్తోంది. దీనికి తోడు, నగర పాలక సంస్థలో అవినీతి, దందాలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు, ఫలితంగా టీడీపీ క్యాడర్ తీవ్రమైన మానసిక క్షోభకు లోనవుతోందట. ఈ పరిస్థితుల దృష్ట్యా, క్యాడర్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోందట. జె.బి. శ్రీనివాస్, మబ్బు నారాయణ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్ లతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తే మూడు బలమైన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించి, పార్టీ బలోపేతం అవుతుందని వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ ఇన్‌ఛార్జ్‌ల నియామకంలో కూడా బలహీనులను పెట్టారనే విమర్శలున్నాయి. సత్యవేడులో కన్వీనర్‌గా శ్రీపతి బాబు తొలగింపు: సత్యవేడులో పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి వచ్చి, అందరి వ్యతిరేకత మధ్య విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తర్వాత జరిగిన పరిణామాలతో ఇరుక్కుపోయారు. ముఖ్యంగా గ్రావెల్ మాఫియా చేసిన కుట్ర, ఓ మహిళా టీడీపీ నాయకురాలితో ఆయన వీడియో బయటకి రావడం వంటి వాటితో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత శ్రీపతి బాబును కన్వీనర్‌గా నియమించినప్పటికీ, అధిష్ఠానం ఆయన్ను తొలగించి కాంట్రాక్టర్ శంకర్ రెడ్డిని ప్రోగ్రామ్ కన్వీనర్‌గా నియమించింది.. ఆయనే ఇన్‌ఛార్జ్‌గా చెప్పుకుంటున్నారు. శంకర్ రెడ్డి పార్టీలో చేరిన వెంటనే తన సామాజిక వర్గాన్ని మొత్తం పార్టీలోకి చేర్చి, వారికి అన్ని వ్యవహారాలు అప్పగించడంతో స్థానిక టీడీపీ క్యాడర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తాజాగా, ఓ దేవాలయం ధర్మకర్తల నియామకంలో వివాదస్పద మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శేఖర్ రెడ్డి అనుచరుడికి అవకాశం కల్పించడం, అనేక కేసులు ఉన్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించడం మరింత వివాదాన్ని రేపింది. ఇక్కడ కూడా తంబళ్లపల్లి మాదిరిగానే భవిష్యత్తులో పార్టీకి నష్టం చేకూర్చవచ్చని క్యాడర్ ఆందోళన చెందుతోంది. కోల్డ్ స్టోరేజ్‌లో పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం:. ప్రతిష్టాత్మకమైన పుంగనూరు నియోజకవర్గం లోనూ ఇదే సమస్య తలెత్తింది. ఇన్‌ఛార్జ్ అయిన చల్లా బాబు రెడ్డి చుట్టూ ఉన్న కోటరీతో స్థానిక కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పార్టీ కోసం నష్టపోయిన, జైళ్లకు వెళ్లిన కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోకుండా, ఆయన కోటరీ తమను ఇబ్బంది పెడుతోందని, ముఖ్యంగా వైసీపీలో తమపై దాడులు చేసిన వారికి అండగా నిలుస్తోందని ఆరోపణలు వచ్చాయి. గతంలో రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్త హత్యను కూడా దీనికి నిదర్శనంగా చూపుతున్నారు. అధికారం చేతికి వచ్చినా, కార్యకర్తలు తమ అధికార దర్పం చూపించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని తెలుస్తోంది. పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం కూడా కోల్డ్ స్టోరేజ్‌లో ఉండిపోయింది. మొత్తం మీద, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి మంత్రి ప్రాతినిధ్యం లేకపోవడం, సీనియర్ నాయకులు పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం వంటి పరిస్థితుల్లో, కొత్త ఇన్‌ఛార్జ్‌లు, అధ్యక్షుల నియామకం తర్వాత అయినా తమను పట్టించుకునే వారు ఉంటారని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు

# సైలెంట్‌గా పెళ్లి పీటలెక్కిన మెహ్రీన్ పిర్జాదా..!




టాలీవుడ్ ప్రముఖ హీరోయిన్ మెహ్రీన్ పిర్జాదా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. గత కొంతకాలంగా తన వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచిన ఈ అందాల నటి, అర్ష్ ఔలఖ్‌ను వివాహం చేసుకున్నట్లు స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ వార్తతో పాటు ఆమె షేర్ చేసిన పెళ్లి ఫోటోలు ఒక్కసారిగా నెట్టింట వైరల్‌గా మారాయి. పెళ్లి ఫోటోలలో మెహ్రీన్ లేత గులాబీ రంగు వెడ్డింగ్ లెహంగాలో సంప్రదాయ ఆభరణాలు ధరించి ఎంతో అందంగా కనిపించారు. అదే రంగులో షేర్వాణీ ధరించిన వరుడు అర్ష్ ఔలఖ్‌తో కలిసి ఆమె ఎంతో ఆనందంగా, సంతోషంగా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. చిరునవ్వులు చిందిస్తున్న ఈ జంట ఫోటోలు సోషల్ మీడియాలో భారీగా షేర్ అవుతున్నాయి. తెలుగు సినీ పరిశ్రమలో 'ఎఫ్2', 'రాజా ది గ్రేట్' వంటి హిట్ సినిమాల ద్వారా మెహ్రీన్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తన అందం, నటనతో ప్రేక్షకులను అలరించిన ఆమె తమిళం, హిందీ చిత్రాల్లో కూడా నటించి పాన్ ఇండియా స్థాయిలో అభిమానులను సంపాదించుకున్నారు. ఈ ప్రయాణంలో ఆమెకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ కూడా ఏర్పడింది. కెరీర్ పరంగా బిజీగా ఉన్న సమయంలోనే మెహ్రీన్ తన జీవిత భాగస్వామిగా అర్ష్ ఔలఖ్‌ను ఎంచుకోవడం విశేషంగా మారింది. తన సోషల్ మీడియా పోస్టులో తేదీని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఈ సంతోషకరమైన వార్తను అభిమానులతో పంచుకున్నారు. మెహ్రీన్ గతంలో నిశ్చితార్థం రద్దు చేసుకుని మానసికంగా కుంగిపోయిన విషయం తెలిసిందే. అలాంటి పరిస్థితుల నుంచి బయటపడి ఇప్పుడు కొత్త జీవితాన్ని ప్రారంభించడం ఆమె అభిమానుల్లో ఆనందాన్ని కలిగిస్తోంది.

సినీ ప్రముఖులు, అభిమానులు పెద్ద ఎత్తున ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మొత్తానికి, మెహ్రీన్ పిర్జాదా పెళ్లి వార్త టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కొత్త జీవితాన్ని ప్రారంభించిన ఈ జంట సంతోషంగా, ఆనందంగా జీవించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# సినిమా

## విష్ణుప్రియతో పెళ్లి వార్తలను ఖండించిన జేడీ చక్రవర్తి


### ఆమె తన ప్రియ శిష్యురాలు మాత్రమేనని స్పష్టీకరణ



టాలీవుడ్ ప్రముఖ నటుడు జేడీ చక్రవర్తి, యాంకర్ విష్ణుప్రియ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై జేడీ చక్రవర్తి స్పందించారు. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, అవన్నీ కేవలం పుకార్లేనని ఆయన కొట్టిపారేశారు.


విష్ణుప్రియ తనకు కేవలం ఒక ప్రియ శిష్యురాలు మాత్రమేనని, తమ మధ్య అంతకు మించిన సంబంధం లేదని స్పష్టం చేశారు. తన తాజా చిత్రం 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "విష్ణుప్రియ నా శిష్యురాలు. ఆమె నాకు ఫోన్ చేసినప్పుడు 'గురువుగారు' అనే మాట్లాడుతుంది. అలాంటి అమ్మాయికి, నాకు ఎఫైర్ ఉందని ప్రచారం చేయడం కంటే దుర్మార్గం మరొకటి లేదు. మాది పవిత్రమైన గురుశిష్యుల బంధం" అని జేడీ చక్రవర్తి వివరించారు. దాదాపు మూడేళ్లుగా తాను విష్ణుప్రియను కలవలేదని కూడా ఆయన తెలిపారు. గతంలో ఓ టీవీ షోలో విష్ణుప్రియ మాట్లాడుతూ.. జేడీ చక్రవర్తి అంటే తనకు ఇష్టమని, ఆయన తల్లి అంగీకరిస్తే పెళ్లి చేసుకుంటానని సరదాగా వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలను పట్టుకొని సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారం మొదలు పెట్టారు. అయితే, ఆ తర్వాత విష్ణుప్రియ కూడా తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, తన దృష్టి అంతా కెరీర్‌పైనే ఉందని స్పష్టం చేశారు. తాజాగా జేడీ చక్రవర్తి ఇచ్చిన ఈ స్పష్టతతో ఈ పెళ్లి పుకార్లకు పూర్తిగా తెరపడినట్లయింది.

# పారితోషికం తగ్గించిన బాలయ్యపై ఇండస్ట్రీ ప్రశంసలు



సినిమా రంగం అంటే గ్లామర్, భారీ బడ్జెట్లు, కోట్లలో పారితోషికాలు గుర్తుకొస్తాయి. ఒక సినిమా హిట్ అయితే చాలు.. హీరోల రెమ్యునరేషన్లు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకుతాయి. సినిమా ఫలితం ఎలా ఉన్నా ముందే కుదిరిన అగ్రిమెంట్ ప్రకారం పూర్తి మొత్తాన్ని తీసుకో వడం ఈ రోజుల్లో సాధారణం. అయితే ఈ ట్రెండ్‌కు పూర్తి విరుద్ధంగా నిలుస్తూ, నిర్మాతల శ్రేయస్సు గురించి ఆలోచించే హీరోగా మరోసారి నందమూరి బాలకృష్ణ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న బాలయ్య 'అఖండ' నుంచి మొదలైన విజయపరంపరతో వరుస హిట్లను అందుకున్నారు. దీంతో ఆయన డిమాండ్, మార్కెట్ రెండూ భారీగా పెరిగాయి. నిర్మాతలు ఆయన అడిగినంత పారితోషికం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న పరిస్థితి నెలకొంది. అయితే గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'అఖండ-2' విషయంలో మాత్రం లెక్కలు కొంత మారాయి. దాదాపు రూ.120-125 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించినప్పటికీ, భారీ ఖర్చుల కారణంగా నిర్మాతలకు ఆశించిన లాభాలు అందించలేకపోయింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బాలయ్య తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. 'అఖండ-2' కోసం దాదాపు రూ.40 కోట్ల పారితోషికం తీసుకున్న ఆయన, ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రానికి తన రెమ్యునరేషన్‌ను గణనీయంగా తగ్గించుకున్నట్లు సమాచారం. దాదాపు రూ.10 కోట్ల వరకు తగ్గించుకుని రూ.30 కోట్లకే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. నిర్మాతపై భారం పడకూడదనే ఉద్దేశంతో తీసుకున్న ఈ నిర్ణయం అందరినీ ఆకట్టుకుంటోంది. సాధారణంగా హీరోలు సినిమా ఫలితంతో సంబంధం లేకుండా తమ పారితోషికాన్ని తీసుకుంటారు. కానీ బాలయ్య మాత్రం సినిమా ఫ్లాప్ అయితే నిర్మాత నష్టపోకూడదనే సిద్ధాంతంతో ముందుకు సాగు తున్నారు. ఇదే కారణంగా ఆయనపై ట్రేడ్ వర్గాలు, సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ వార్త బయటకు రాగానే అభిమానులు 'మా బాలయ్య బంగారం' అంటూ సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో బాలయ్య పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో అంచనాలు భారీగా పెరిగాయి.

## సూర్యతోపాటు థియేటర్లలోకి విజయ్.. జననాయగన్ రిలీజ్ డేట్ ఫిక్సయినట్టేనా..?




కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ కాంపౌండ్‌నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ జన నాయగన్. కార్తీ (ఖాకీ) ఫేం హెచ్ వినోథ్ దర్శకత్వం వహిస్తున్న తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో విడుదల కానుంది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం జనవరి 9నే ఈ మూవీ వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్‌గా విడుదల కావాల్సింది. కానీ సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేయకపోవడంతో విడుదల డైలమాలో పడిపోయింది.. సినిమాలో కొన్ని సన్నివేశాలు మతపరమైన బావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని.. ఆర్మీ దళాలను సమస్యాత్మక కోణంలో చూపించారని సీబీఎఫ్‌సీ సెన్సార్ సర్టిఫికెట్‌ను జారీ చేయలేదు. ఈ మూవీ రివైజింగ్ కమిటీ ముందు స్క్రీనింగ్ అయిన తర్వాత రిలీజ్‌పై క్లారిటీ వచ్చే అవకాశమున్నట్టు వార్తలు వచ్చాయి. తాజాగా ఈ మూవీ విడుదలపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడినట్టేనన్న వార్త ఒకటి నెట్టంట వైరల్ అవుతోంది. లేటెస్ట్ టాక్ ప్రకారం జననాయగన్‌ను మే 14న రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. మే 8వ తేదీని కూడా పరిశీలిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. వీటిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదే రోజున సూర్య నటించిన కరుప్పు కూడా రాబోతుందని తెలిసిందే. మొత్తానికి ఇదే నిజమైతే ఓ వైపు సూర్య, మరోవైపు విజయ్.. ఇద్దరు స్టార్ల మధ్య పోటీ ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. సెన్సార్ షిప్ సమస్యల కారణంగా పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో జననాయగన్ ఓటీటీ డీల్‌ను రద్దు చేసుకుందంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి లైన్‌లో ఉండబోతున్న ఈ చిత్రానికి హెచ్ వినోథ్ దర్శకత్వం వహించాడు. పూజా హెగ్డే ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మమితా బైజు కీ రోల్ చేస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాష్ రాజ్, నరైన్, ప్రియమణి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన దువ్వాడ మాధురి..




వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తో ఉన్న అనుబంధం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో పాప్యులర్ అయిన మాధురి... ఇప్పుడు నటిగా తన అదృష్టాన్ని పరీక్షిం చుకుంటున్నారు. 'చీన్ టపాక్‌డుం డుం' అనే విభిన్నమైన టైటిల్‌తో వస్తున్న చిత్రం ద్వారా ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలో మాధురి 'గైరమ్మత్త' అనే గంభీరమైన పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు.

తాజాగా విడుదలైన ఆమె పోస్టర్ చూస్తుంటే, సినిమాలో ఆమె పాత్ర చాలా వైవిధ్యంగా ఉండబోతోందని అర్థమవుతోంది. 'శుభం' సినిమా ఫేమ్ గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా నటిస్తుండగా, ఆయన సరసన బ్రిగిడా సాగా హీరోయిన్‌గా నటిస్తోంది. వైఎన్ లోహిత్ దర్శకత్వంలో 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై శ్రీను నాగులపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి టాలీవుడ్ స్టార్స్ తరలివచ్చారు.

## విక్రమ్ క్రేజ్‌ను క్యాష్ చేసుకున్న పోలీసులు.. రీక్రియేషన్ వీడియో వైరల్

కోలీవుడ్ స్టార్ యాక్టర్ విక్రమ్ ఇటీవల సరదాగా పోస్ట్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ క్లిప్‌కు 5 కోట్ల మందికిపైగా వీక్షించడంతోపాటు 6 కోట్ల లైక్స్‌ను సాధించి ఇండియావైడ్‌గా వైరల్ అయిన విషయం తెలిసిందే. అయితే ఈ వీడియో కేరళ పోలీసుల కంట పడింది. ఇంకేంటి విక్రమ్ పాపులారిటీని తమ నార్కోటిక్స్ డ్రగ్స్ కు వ్యతిరేకంగా చేపట్టిన ప్రచార కార్యక్రమానికి వినియోగించారు. ఈ వీడియోలో విక్రమ్ ఎక్స్‌ప్రెషన్స్ అనుగుణంగా అధికారుల మిమిక్రీని మిక్స్ చేసి '60 అయినా 16 అయినా పర్వాలేదు అనే ట్యాగ్‌లైన్‌తో ప్రతీ చోటా మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతూ మలయాళంలో ఒక మెసేజ్‌ను పోస్ట్ చేసి నయా వెర్షన్‌ను రీక్రియేట్ చేసి నెట్టింట పోస్ట్ చేశారు. ఓ వైపు వినోదంతోపాటు మరోవైపు అవగాహన కార్యక్రమాన్ని కల్పించాలనే ఆలోచన చేయడం పట్ల అభిమానులతోపాటు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.. ఇటీవలే కాలంలో వచ్చిన ఉత్తమ వీడియో ఇదేనని అభివర్ణిస్తున్నారు. రీక్రియేషన్ అంటూ ట్రేడ్ ఎనలిస్ట్ రమేశ్ బాలా ట్వీట్ చేశారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215